# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 247 | మంగళవారం 19 మార్చి 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# హస్తినలో సీఎం!



- ఢిల్లీలో సీఎం రేవంత్.. సోనియా గాంధీతో భేటీ.. కీలక చర్చ
- లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపైనా చర్చించినట్లు సమాచారం.
- ఎన్నికల వ్యూహాలు, పార్టీ ప్రచార సభలపై చర్చ
- సోనియాగాంధీ, ప్రియాంకగాంధీలను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- టెన్ జన్‌పథ్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై వారి మధ్య చర్చ

**హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ, ప్రియాంకగాంధీతో భేటీ అయ్యారు. ఈ రోజు ముంబై నుండి నేరుగా ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి టెన్ జన్‌పథ్‌కు వెళ్లారు. అక్కడే ఉన్న రాహుల్ గాంధీతోనూ ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలు... అమలు చేసిన హామీలపై వారితో చర్చించినట్లుగా తెలుస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఢిల్లీలో పర్యటిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో రేవంత్ భేటీ అయ్యారు. రేవంత్ వెంట రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపా మున్షి కూడా ఉన్నారు. తెలంగాణలోని రాజకీయ పరిణామాలపై సోనియాకు రేవంత్ వివరించినట్లు తెలుస్తోంది. లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపైనా చర్చించినట్లు సమాచారం. ఎన్నికల వ్యూహాలు, పార్టీ ప్రచార సభలపై చర్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సోనియా, రాహుల్, ప్రియాంక ప్రచార సభలపై చర్చించిన రేవంత్.. తెలంగాణలో వందరోజుల పాలనపై అధిష్టానానికి వివరించినట్లు తెలుస్తోంది. టీవల కాంగ్రెస్‌లో చేరిన వారికి టికెట్లు ఖరారు అంశంపై చర్చిం చినట్లు వినికిడి. తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై కూడావారితో చర్చించారని తెలుస్తోంది. లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై కూడా వారి మధ్య చర్చ జరిగింది. రేపు కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ సమావేశమై -మిగతా3లో

# మిమ్మల్ని ఎప్పటికీ మరువను

- తెలంగాణను వదిలి వెళ్తున్నందుకు బాధగా ఉంది...
- రాజీనామాపై స్పందించిన తమిళిసై.. దానికి మాత్రం నో రిప్లై
- ఎప్పటికీ తెలంగాణ వారికి సోదరినే అని వ్యాఖ్య
- తాను ప్రజా సేవ కోసం తిరిగి వెళ్తున్నానని వెల్లడి
- తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన తమిళిసై



**హైదరాబాద్**

'నేను ఎప్పటికీ మీ సోదరినే... తెలంగాణను వదిలి వెళుతున్నందుకు చాలా బాధగా ఉంది... ఈ ప్రాంత ప్రజలను ఎన్నటికీ మరువ'నని తమిళిసై సౌందరరాజన్ అన్నారు. తెలంగాణ గవర్నర్ పదవికి రాజీనామా చేసిన అంశంపై ఆమె తాజాగా స్పందించారు. తాను ప్రజాసేవ కోసం తిరిగి వెళుతున్నానన్నారు. తనపై చూపిన ప్రేమాభిమానాలకు తెలంగాణ ప్రజలందరికీ ధన్యవాదాలు అని పేర్కొన్నారు. ఈ రోజు మధ్యాహ్నం ఆమె శంషాబాద్ విమానాశ్రయం నుంచి చెన్నైకి బయలుదేరారు. తెలంగాణ గవర్నర్ పదవికి రాజీనామా చేయడంపై తమిళిసై సౌందరరాజన్ తాజాగా స్పందించారు. ప్రజా సేవ -మిగతా3లో



# నిజాయితీకి కట్టుబడి ఉన్నా

**హైదరాబాద్**

బీఎస్పీకి రాజీనామా చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సోమ వారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఎర్రవల్లిలో ఉన్న ఫామ్‌హౌస్‌లో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు సమక్షంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు.. తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. గజ్వేల్‌లోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌కు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో తెలంగాణ విశాల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌లో చేరుతున్నానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ గేట్లు తెరిస్తే వెళ్లిన గొర్రెల్లాగా వచ్చిన వ్యక్తిని కాదని ప్రవీణ్ -మిగతా3లో

## కాంగ్రెస్, బీఆర్ఎస్
# పని ఖతం



- తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో బీఆర్ఎస్ ఆడుకుంది: ప్రధాని మోదీ
- భారత్ వికాసంతో తెలంగాణా వికాసం కూడా సులభమైతుంది.
- మూడురోజుల్లో మూడుసార్లు తెలంగాణా వచ్చాను
- వందల కోట్ల రూపాయలు తెలంగాణా వికాసం కోసం కేంద్రం కేటాయిస్తున్నాం.
- తెలంగాణాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఊసే లేదిప్పుడు.
- తెలంగాణాతో పాటు, దేశం మొత్తం మళ్ళీ బీజేపీ కావాలని కోరుతోంది

**జగిత్యాల**

తెలంగాణ ప్రజలు కొత్త చరిత్ర సృష్టించబోతున్నారు. ఎన్నికల తర్వాత తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పని అయిపోతుందన్నారు ప్రధాని మోదీ. తెలంగాణలో బీజేపీ క్రమంగా బలపడుతోందని చెప్పుకొచ్చారు ప్రధాని నరేంద్ర మోదీ. కాగా, జగిత్యాలలో బీజేపీ విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ..'మే 13న తెలంగాణ ప్రజలు కొత్త చరిత్ర సృష్టించబోతున్నారు. వికసిత్ భారత్ కోసం తెలంగాణ ప్రజలు ఓటు వేయబోతున్నారు. తెలంగాణలో బీజేపీ క్రమంగా బలపడుతోంది. మాల్కాజ్‌గిరిలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తెలంగాణ ప్రజలు అబ్ కీ బార్.. 400 పార్ అంటున్నారు. మొన్ననే లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. గడిచిన మూడు రోజుల్లో -మిగతా3లో



## చాయ్ బిస్కెట్ ఖర్చుల లెక్కలూ చెప్పాల్సిందే..

- ప్రచారంపై ఈసీ మార్గదర్శకాలు ఇవే..
- అభ్యర్థుల ప్రకటనతో ప్రధాన పార్టీలు
- గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు
- ఒక్కో అభ్యర్థికి లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు ఖర్చు
- లోక్‌సభ అభ్యర్థులెవరూ రూ.95 లక్షలకు మించి ఖర్చు చేయరాదు
- అసెంబ్లీ అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని స్పష్టం



## 'మోదీ నాయకత్వంతోనే సాధ్యం'

- భారతదేశం త్వరలో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది.
- రాబోయే రాజుల్లో భారత్ ప్రపంచానికి మార్గదర్శం అవుతుంది
- దేశ ప్రజలు మోదీ మూడోసారి ప్రధాని కావాలని కోరుకుంటున్నారు
- హర్యానా ప్రజలు గత ఎన్నికల్లో మాదిరిగానే బీజేపీకి సహకరించాలి

# 'ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత క్రియాశీల పాత్ర

- కవిత అరెస్ట్‌పై ఈడీ కీలక ప్రెస్‌నోట్ విడుదల
- 'ఢిల్లీ లిక్కర్ కేసులో 128.79 కోట్ల రూపాయల ఆస్తుల జప్తు చేశాం
- ఆస్తుల జప్తును అడ్జుడికేటింగ్ అథారిటీ ఆమోదించింది.
- ఈ వ్యవహారంలో ఆప్ పార్టీ నేతలకు 100 కోట్ల రూపాయలు ముడుపులు అప్పజెప్పడంలో కవిత క్రియాశీల పాత్ర పోషించారు

**ఢిల్లీ**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక విషయాలు వెల్లడించింది. ఈ మేరకు ఈడీ సోమవారం కవిత అరెస్ట్‌పై అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఢిల్లీ లిక్కర్ కేసులో ఈ నెల15న కవితను అరెస్ట్ చేసినట్లు పేర్కొంది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు 7 రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చిందని పేర్కొంది. ఈ నెల 23 తేదీ వరకు కవిత కస్టడికి తీసుకున్నట్లు ప్రకటనలో తెలిపింది. 'ఢిల్లీ లిక్కర్ కేసులో 128.79 కోట్ల రూపాయల ఆస్తుల జప్తు చేశాం. ఆస్తుల జప్తును అడ్జుడికేటింగ్ అథారిటీ ఆమోదించింది. మద్యం విధానం -మిగతా3లో



# చాయ్ బిస్కెట్ ఖర్చుల లెక్కలూ చెప్పాల్సిందే

లోక్‌సభ ఎన్నికలకు ఎలక్షన్ కమిషన్ తేదీలు ప్రకటించడంతో దేశవ్యాప్తంగా ఎన్నికల వేడి రాజుకుంది. అభ్యర్థుల ప్రకటనతో ప్రధాన పార్టీలు తలమునకలయ్యాయి. గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నాయి. ఎన్నికలు అనగానే ఎంతో వ్యయంతో కూడుకున్న వ్యవహారం. ఒక్కో అభ్యర్థికి లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు ఖర్చవుతుంది. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు మార్గదర్శకాలు విడుదల చేసింది. లోక్‌సభ అభ్యర్థులెవరూ రూ.95 లక్షలకు మించి ఖర్చు చేయరాదని అసెంబ్లీ అభ్యర్థి రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని స్పష్టం చేసింది.

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రతి అభ్యర్థి నామినేషన్ దాఖలుతో పాటు రోజువారీ ఎన్నికల ఖర్చులను డైరీలో నమోదు చేయాలి. ఎన్నికల క్రతువు పూర్తయ్యేంత వరకు అన్ని లెక్కలను రాసుకోవాలి. ఓటర్ల సంఖ్య ఆధారంగా ఈసీ గరిష్ఠ వ్యయ పరిమితిని నిర్ణయిస్తుంది. రాజకీయ పార్టీలకు ఈ పరిమితి నుంచి మినహాయింపు ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో గరిష్ఠ వ్యయ పరిమితి 20 ఏళ్లలో దాదాపు 4 రెట్లు పెరిగింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ సమయంలో అభ్యర్థులు లేదా కార్యకర్తలు తమ వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉంచుకోవడానికి వీలు లేదు. బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు, వాహనాలు, టీ,



బిస్కెట్లు, బెలూన్‌లు వంటి ప్రతి వస్తువుపై ఖర్చు వివరాలను చెప్పాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం సైతం ఈ ఖర్చులకు ధరలు నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో నెలవారీ ఆఫీసు అద్దె రూ. 5000 కాగా నగరాల్లో రూ.10,000గా స్పష్టం చేసింది. కప్పు టీ ధర రూ.8 కాగా సమోసా ధర రూ.10. బర్ఫీ కిలో రూ.200, బిస్కెట్లు రూ.150, బ్రెడ్ పకోడా రూ.10, శాండ్‌విచ్ రూ.15, జిలేబీ రూ.140గా నిర్ణయించారు.

# నా మాటలను మోదీ వక్రీకరించారు.. 'శక్తి' వివాదంపై రాహుల్

**న్యూఢిల్లీ:** 'శక్తి'పైనే పోరాటం అంటూ తాను చేసిన వ్యాఖ్యలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వక్రీకరించారని రాహుల్ గాంధీ అన్నారు. ముంబైలో రాహుల్ సోమవారంనాడు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన నేపథ్యంలో ఆయన తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తన వాదన వినిపించారు. 'మోదీ నా మాటలు ఇష్టపడరు. ఆయన నా మాటలు వక్రీకరించేందుకు, అర్థం మార్చిచెప్పేందుకు ప్రయత్నించారు. ఎందుకంటే...ఆయనకు నేను లోతైన సత్యాన్ని చెప్పిన విషయం బాగా తెలుసు" అని రాహుల్ అన్నారు. ఎవరిమీదైతే తాము పోరాటం సాగిస్తున్నామో దానినే శక్తి అని తాను సంబోధించానని, ఆ శక్తి మోదీనే అని అన్నారు. ఆ శక్తి భారతదేశ వాణిని, సంస్థలను, సీబీఐ, ఐటీ శాఖ, ఈడీ, ఎన్నికల కమిషన్, మీడియా, పరిశ్రమలు, రాజ్యాంగ వ్యవస్థను తమ చెప్పుచేతుల్లో పెట్టుకుంటోందని వ్యాఖ్యానించారు. ఆ పవర్‌తోనే నరేంద్ర మోదీ వేలకోట్ల రూపాయల రుణాలను



మాఫీ చేస్తుండగా, స్వల్పమైన రుణాలను కూడా తీర్చలేక రైతులను ఆత్మహత్యలకు ప్రేరేపిస్తోందని విమర్శించారు.

రాహుల్ వెర్సస్ మోదీ

'శక్తి' వ్యాఖ్యల వివాదం ముంబైలో ఆదివారం జరిగిన 'భారత్ జోడో న్యాయయాత్ర' ముగింపు సమావేశంలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, మోదీపై పోరాటం వ్యక్తిగతం కాదన్నారు. శక్తి(అధికారం)కి వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామని, ఇక్కడ శక్తి అంటే ఏమిటనే ప్రశ్న ఉందని అన్నారు. రాజు (మోదీ) ఆత్మ ఈవీఎంలు, ఈడీ, సీబీఐ, ఆదాయం పన్ను సంస్థల్లో ఉందని, అవి లేకుండా గెలవలేరని విమర్శించారు. ఆయన వ్యాఖ్యలను ప్రధాన మంత్రి మోదీ తెలంగాణలోని జగిత్యాలలో సోమవారం జరిగిన ర్యాలీలో తిప్పికొట్టారు. తమ పోరాటం శక్తితోనేనంటూ 'ఇండి' కూటమి చెబుతోందని, తన వరకూ ప్రతి తల్లి, చెల్లి, కూతురు అంతా శక్తిస్వరూపాలేనని, శక్తి రూపంలో వారిని ఆరాధిస్తానని, తాను భరతమాత ఆరాధకుడినని చెప్పారు. ఈ శక్తిని అంతం చేస్తామంటూ 'ఇండి' కూటమి సవాలును ఎదుర్కొనేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.

# 'మోదీ నాయకత్వంతోనే సాధ్యం': అశోక్ తన్వర్

**చండీగఢ్:** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి చెందిన (వికసిత భారత్) భారతదేశానికి బలమైన పునాది పడిందని బీజేపీ నాయకుడు, లోక్‌సభ అభ్యర్థి అశోక్ తన్వర్ అన్నారు. తన్వర్ ఆమ్ ఆద్మీ పార్టీని విడిచిపెట్టి, రెండు నెలల క్రితం భారతీయ జనతా పార్టీలో చేరారు. భారతదేశం త్వరలో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. రాబోయే రాజుల్లో భారత్ ప్రపంచానికి మార్గదర్శం అవుతుందని మోదీ హామీ ఇచ్చారని అశోక్ తన్వర్ అన్నారు. దేశ ప్రజలు మోదీ మూడోసారి ప్రధాని కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. హర్యానా ప్రజలు గత ఎన్నికల్లో మాదిరిగానే బీజేపీకి సహకరించాలని కోరారు. గడచిన 10 సంవత్సరాల్లో దేశం వివిధ రంగాల్లో శరవేగంగా



అభివృద్ధి చెందిందని తన్వర్ తెలిపారు. ప్రభుత్వం మహిళలతో సహా వివిధ వర్గాలకు సాధికారత కల్పించేందుకు అనేక చర్యలు తీసుకున్నాయని చెప్పారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలు, రైతులకు మేలు చేసేలా అనేక ప్రజా సంక్షేమ పథకాలను చేపట్టాయని తెలిపారు. ఆప్‌ని వీడి బీజేపీలో చేరినప్పుడు టిక్కెట్‌ను ఆశిస్తున్నారా అనే ప్రశ్నకు అశోక్ తన్వర్ ఇలా సమాధానమిచ్చారు. పార్టీ కోసం క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా, బీజేపీ తనకు అప్పగించిన ఏ బాధ్యతనైనా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. నేను కొత్త వ్యక్తినని పార్టీ ఏ రోజూ భావించలేదు. అగ్ర నాయకత్వం నుంచి కూడా అందరూ మద్దతుగా ఉన్నారు.

# 'నాపై అరవొద్దు'.. న్యాయవాదిపై సీజేఐ ఆగ్రహం

**న్యూఢిల్లీ:** ఎలక్టోరల్ బాండ్‌లకు సంబంధించిన అన్ని వివరాలను మార్చి 21లోగా అందించాలని ఎస్‌బీఐకు సుప్రీం డెడ్‌లైన్ విధించింది. ఎలక్టోరల్ బాండ్ల కేసు విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాదిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసు విచారణ నేపథ్యంలో నేడు సర్వోన్నత న్యాయస్థానం లో పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. వీటిలో సీనియర్ న్యాయవాది మాథ్యూస్ నెడుంపర, సీజేఐ మధ్య జరిగిన సంభాషణ ఒకటి. ఎలక్టోరల్ బాండ్ల కేసు అసలు న్యాయబద్ధమైన సమస్య కాదని, ఇది విధానపరమైన అంశమని న్యాయవాది మాథ్యూస్ నెడుంపర పేర్కొన్నారు. దీనిలో కోర్టులు జోక్యం చేసుకోవడం సరైనది కాదని తెలిపారు. కావున ఈ కేసులో తీర్పుపై పునఃసమీక్ష చేయాలని కోరారు. నెడుంపర మాట్లాడుతుండగానే సీజేఐ మధ్యలో జోక్యం చేసుకొని మాట్లాడారు.. 'మిస్టర్ నెడుంపర నేను ఈ దేశ పౌరుడిని.' నాపై అరవొద్దు అంటూ గట్టిగా సమాధానమిచ్చారు. దీనిపై నెడుంపర స్పందిస్తూ.. 'లేదు, లేదు, నేను చాలా సాఫ్ట్‌గా మాట్లాడుతున్నాను' అంటూ బదులిచ్చారు. సీజేఐ చంద్రచూడ్ కల్పించుకొని.. ఇది హైడ్ పార్క్ కార్నర్ మీటింగ్ కాదని అన్నారు. 'మీరు కోర్టులో ఉన్నాను. మీరు ఒకవేళ పిటిషన్ వేయాలనుకుంటే ఫైల్ చేయండి. నేను చీఫ్ జస్టిస్‌గా నా నిర్ణయం తెలియజేశాను. మీ మాటలు వినాలనుకోవడం లేదు. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పిటిషన్ దాఖలు చేయండి. ఇది కోర్టు నియమం. దాని ప్రకారం నడుచుకోండి' అంటూ చీవాట్లు పెట్టారు. న్యాయవాది నెడుంపర మళ్లీ వాదిస్తుండగా జస్టిస్ బీఆర్ గవాయి జోక్యం చేసుకుని..మీరు న్యాయ నిర్వహణ ప్రక్రియను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అయినప్పటికీ న్యాయవాది వెనక్కి తగ్గలేదు.





ఆయన మాట్లాడుతుండగా.. 'ఇక మీరు ఆపండి.. కోర్టు నియమాలు అనుసరించే వరకు మీ మాటలను మేము వినదల్చుకోలేదు.' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై నెడుంపర స్పందిస్తూ.. తాము పిటిషన్ దాఖలు చేయనున్నట్లు చెప్పారు. కాగా నెడుంపర గతంలో ఎదుర్కొన్న కోర్టు ధిక్కార చర్యను కూడా ధర్మాసనం గుర్తు చేసింది. 2019లో నెడుంపరా కోర్టు ధిక్కారానికి పాల్పడినట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ సమయంలో అతను ఇకపై సుప్రీంకోర్టు లేదా బాంబే హైకోర్టుకు చెందిన ఏ జడ్జిని తక్కువ చేసి మాట్లాడే ప్రయత్నం చేయనని హామీ ఇచ్చాడు. దీంతో న్యాయస్థానం అతనికి మూడు నెలల జైలు శిక్ష విధించింది. అలాగే ఏడాది పాటు సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేయకుండా నిషేధం విధించింది. అయితే భవిష్యత్తులో ఇలాగే కొనసాగితే మాత్రం సస్పెండ్ చేస్తామని హెచ్చరించింది. అదే విధంగా కేసు విచారణలో భాగంగా సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అదిశ్ అగర్వాల్ వాదనలు వినేందుకు కూడా కోర్టు నిరాకరించింది. ఎన్నికల బాండ్ల పథకం రద్దుకు సంబంధించిన తీర్పుపై సుమోటోగా సమీక్ష చేయాలని అదీశ్ అగర్వాల్ కోరడంతో చీఫ్ జస్టిస్ తీవ్రంగా స్పందించారు. 'మీరు సీనియర్ న్యాయవాది మాత్రమే కాదు ఎస్సీబీఏ అధ్యక్షుడు. నా సుమోటో అధికారాలను ప్రశిస్తూ లేఖ రాశారు. ఇవన్నీ ప్రచారానికి సంబంధించిన అంశాలు.. మేము దీనిలో భాగం కాలేం.. నన్ను ఇంకేమీ మాట్లాడని వ్వద్దు.. ఇది అసహ్యంగా ఉంటుంది' ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మూడు దశాబ్దాల తర్వాత ఇదే తొలిసారి..



రానున్న లోక్ సభ ఎన్నికలు పలు విశేషాలు, ప్రత్యేకతలను సంతరించుకున్నాయి. ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో జరగనున్న 2024 లోక్‌సభ ఎన్నికలు అత్యంత సుదీర్ఘంగా జరగనున్నాయి. జూన్ 1న చివరి దశ ఓటింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. కేంద్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు జూన్ నెలలో పోలింగ్ జరగడం మూడు దశాబ్దాల తర్వాత ఇదే తొలిసారి. దేశంలో మొదటి లోక్‌సభ ఎన్నికలు జరిగిన 1951–52 తర్వాత ఇవే సుదీర్ఘమైన లోక్‌సభ ఎన్నికలు. 1951 అక్టోబర్ 25 నుంచి 1952 ఫిబ్రవరి 21 మధ్య దాదాపు నాలుగు నెలల పాటు లోక్‌సభకు మొదటి సార్వత్రిక ఎన్నికలు 68 దశల్లో జరిగాయి.

**1991లో జూన్‌లో ఓటింగ్**

1991లో మాత్రమే లోక్‌సభ ఎన్నికలు జూన్ నెలలో జరిగాయి. ఆ సంవత్సరం మార్చి 13న కేంద్రంలోని ప్రధానమంత్రి చంద్రశేఖర్ నేతృత్వంలోని ప్రభుత్వం రద్దయిన తర్వాత మే 20, జూన్ 12, జూన్ 15 తేదీల్లో ఓటింగ్ జరిగింది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా మూడు రాష్ట్రాల్లో పోలింగ్ వాయిదా పడింది. గత మూడు లోక్‌సభ ఎన్నికల్లో ఎప్పుడూ ఎన్నికలు మే నెల తర్వాత జరగలేదు. 2019లో పోలింగ్ చివరి తేదీ మే 19 ?కాగా ఫలితాలు మే 23న వెల్లడయ్యాయి. 2014లో ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికలు మే 12 వరకు జరిగాయి. ఫలితాలు మే 16న ప్రకటించారు. 2009లో చివరి దశ పోలింగ్ మే 13న జరిగింది.

## డీల్ కుదిరింది!

## బీజేపీ 17, జేడీయూ 16..

మొత్తం 40 లోక్ సభ స్థానాలున్న బీహార్‌లో బీజేపీ 17 స్థానాల్లో పోటీ



బిహార్‌లో అధికార ఎన్డీయే కూటమిలో వచ్చే లోక్‌సభ ఎన్నికలకు సీట్ల పంపకంపై ఒప్పందం కుదిరింది. మొత్తం 40 లోక్ సభ స్థానాలున్న బీహార్‌లో బీజేపీ 17 స్థానాల్లో పోటీ చేయనుండగా, నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ 16 స్థానాల్లో పోటీ చేయనుంది. దివంగత రామ్‌విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) 5 స్థానాల్లో పోటీ చేయనుంది. చిరాగ్ పాశ్వాన్ హాజీపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తారని బీహార్ ఎల్‌జేపీ (రామ్ విలాస్) చీఫ్ రాజు తివారీ తెలిపారు. రాష్ట్రీయ లోక్ సమతా పార్టీకి చెందిన ఉపేంద్ర కుష్వాహా, జితన్ రామ్ మాంఝీ హిందుస్థానీ అవామ్ మోర్చాతో సహా ఇతర ఎన్‌డీఏ మిత్రపక్షాలు చెరొక్క సీటును పంచుకున్నాయి. అభ్యర్థుల జాబితాను త్వరలో ప్రకటిస్తామని బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి చెప్పారు. 2019 ఎన్నికల్లో బీజేపీ, సీఎం నితీశ్ కుమార్‌కు చెందిన జేడీయూ, దివంగత రామ్‌విలాస్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జేపీ) కలిసి 39 సీట్లు, 53 శాతానికి పైగా ఓట్లు సాధించాయి. కాంగ్రెస్‌కు ఒక్క సీటు రాగా ఆర్జేడీ ఒక్క లోక్‌సభ సీటు కూడా గెలుపొందలేకపోయింది.

## ఈసారి కొడితే హ్యాట్రిక్..!




గౌతమ్ బుద్ధ్ నగర్ అంటే చాలా మందికి తెలియకపోవచ్చు కానీ నోయిడా అంటే మాత్రం ఇట్టే గుర్తొస్తుంది. ఢిల్లీ సమీపంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన ప్రాంతం ఇది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఈ లోక్‌సభ నియోజకవర్గంలో హ్యాట్రిక్‌పై బీజేపీ కన్నేసింది. జీబీ నగర్‌లోని నోయిడా, జేవార్, దాద్రీ, బులంద్‌షహర్‌లోని సికింద్రాబాద్, ఖుర్జాలతో కూడిన మొత్తం ఐదు సెగ్మెంట్లలో గౌతమ్ బుద్ధ్ నగర్ నియోజకవర్గంలో 2022 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన భారతీయ జనతా పార్టీ ఇప్పుడు రానున్న లోక్‌సభ ఎన్నకల్లోనూ అవే ఫలితాలను అంచనా వేస్తోంది. ఇక్కడ గట్టి పోటీ ఇచ్చేందుకు బీఎస్‌పీ, కాంగ్రెస్, ఎస్‌పీతో సహా ప్రధాన రాజకీయ పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

తమ ప్రభుత్వం చేపట్టిన నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం, దాద్రీ, బోడకిలో రవాణా సౌకర్యాలు, రైలు, మెట్రో విస్తరణ కారిడార్‌లు, సహా అనేక అభివృద్ధి ప్రాజెక్టులు, పారిశ్రామిక కేంద్రాలతో పాటు రెండుసార్లు ఎంపీగా పనిచేసిన డాక్టర్ మహేష్ శర్మపై బీజేపీ విశ్వాసంతో ఉంది. గౌతమ్ బుద్ధ నగర్ రాజకీయ చరిత్రలో డాక్టర్ మహేష్ శర్మ విజయ పరంపర దశాబ్దం క్రితమే మొదలైంది. 2014 ఎన్నికలలో డాక్టర్ శర్మ 5,99,702 ఓట్లు, 50 శాతం ఓట్లతో మొదటిసారి విజయం సాధించారు. సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి నరేంద్ర భాటిని 2,80,212 ఓట్ల తేడాతో ఓడించారు. తరువాత, 2019 ఎన్నికలలో 8,30,812 ఓట్లు, 59.64 శాతం ఓట్లతో మరోసారి గెలుపొందారు. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు ఏడు దశల్లో 2024 లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల సంఘం ప్రకటించింది. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. నోయిడా పేరుతో ప్రసిద్ధి చెందిన గౌతమ్ బుద్ధ్ నగర్ లోక్‌సభ స్థానానికి రెండో దశలో ఉత్తరప్రదేశ్‌లోని ఇతర నియోజకవర్గాలతో పాటు ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుంది. 2019 లోక్‌సభ ఎన్నికల నాటి ఎలక్షన్ కమిషన్ డేటా ప్రకారం, గౌతమ్ బుద్ధ నగర్‌లో 2,302,960 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,268,324 మంది పురుషులు, 1,034,503 మంది మహిళలు కాగా 133 మంది థర్డ్ జెండర్ ఓటర్లు. ఇక నియోజకవర్గంలో 3,297 పోస్టల్ ఓట్లు, 5,482 సర్వీస్ ఓటర్లు ఉన్నారు.

# మిమ్మల్ని ఎప్పటికీ మరువను

-మొదటి పేజి తరువాయి

కోసం తిరిగి వెళ్తున్నానని ఆమె తెలిపారు. తెలంగాణ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ ప్రజలను వదిలేసి వెళ్తున్నందుకు బాధగా ఉందన్నారు. అయితే రాష్ట్ర ప్రజలందరూ తనకెప్పుడూ అన్నాదమ్ములు, అక్కచెల్లెళ్లేనని అన్నారు. లోక్ సభ ఎన్నికలలో ఆమె బీజేపీ తరఫున తమిళనాడులో బరిలోకి దిగనున్నారని తెలుస్తోంది. గవర్నర్ పదవి చేపట్టకముందు ఆమె తమిళనాడు బీజేపీ అధ్యక్షురాలిగా ఉన్నారు. 2019 సెప్టెంబర్ నుంచి తెలంగాణ గవర్నర్‌గా ఉన్నారు. ఆ తర్వాత పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆమె ఈ రెండింటికి రాజీనామా చేశారు. కాగా తెలంగాణ గవర్నర్ పదవికి సోమవారం తమిళిసై రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తన రాజీనామా లేఖను రాష్ట్రపతికి పంపించారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు నుంచి



బీజేపీ తరపున ఆమె బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. అంతేగాక గవర్నర్ పదవి చేపట్టకముందు తమిళనాడు బీజేపీ అధ్యక్షురాలిగా ఆమె వ్యవహరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆమె నేడు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి చెన్నై బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడుతూ.. తనపై చూపిన ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలను ఎన్నటికీ మరవనని.. అందరితో కలుస్తూ ఉంటానని చెప్పారు. అయితే ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారనే ప్రశ్నను.. ఆమె దాటవేస్తూ వెళ్ళిపోయారు. ఇదిలా ఉండగా సెప్టెంబర్ 8న తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తమిళిసై.. ఆ తర్వాత పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తించారు.

# హస్తినలో సీఎం!

-మొదటి పేజి తరువాయి

అభ్యర్థులను ఖరారు చేయనుంది. ప్రియాంక గాంధీని కలిసినట్లు సీఎం రేవంత్ రెడ్డి తన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పేర్కొని... ఫొటోను షేర్ చేశారు. రేపు(మంగళవారం) కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశం ఉంది. ఈ సమావేశంలో రేవంత్ పాల్గొననున్నారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరగనున్నీ సమావేశంలో ఎన్నికల మేనిఫెస్టోతో పాటు..దేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించనున్నారు. కాంగ్రెస్ తరపున పోటీ చేయనున్న లోక్ సభ అభ్యర్థులను ఖరారు.. వివిధ రాష్ట్రాల్లో భాగస్వామ్య పార్టీలతో సీట్ల సర్దుబాటుపై కుదిరిన ఒప్పందాలకు ఆమోద ముద్ర వేసే అవకాశముంది. ఇక రేపు కాంగ్రెస్ జాబితా రానుండటంతో రేవంత్ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.



# కాంగ్రెస్, బీఆర్ఎస్ పని ఖతం

-మొదటి పేజి తరువాయి

రెండు సార్లు తెలంగాణకు వచ్చాను.

దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం. భారత్ అభివృద్ధి చెందితే తెలంగాణలో కూడా అభివృద్ధి జరుగుతుంది. బీఆర్ఎస్‌పై ప్రజలకు ఉన్న ఆగ్రహం అసెంబ్లీ ఎన్నికల్లో బయటపడింది. తెలంగాణను దోచుకున్న వాళ్లను మేము వదిలిపెట్టం. మాకు అధికారం కంటే ప్రజా సంక్షేమం ముఖ్యం. తెలంగాణలో ఎన్నో వేల కోట్ల రూపాయాలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. తెలంగాణలో బీజేపీ అధికారంలో ఉంటే.. రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేది. తెలంగాణలో బీజేపీకి ఎన్ని సీట్లు ఎక్కువ వస్తే.. నాకు అంత శక్తి వస్తుంది. పసుపు రైతులను బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎప్పుడూ పట్టించుకోలేదు. బీజేపీ ప్రభుత్వం పసుపు రైతులకు ఎంతో మేలు చేసింది. ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ పని అయిపోతుంది. పదేళ్లపాటు బీఆర్ఎస్ తెలంగాణను దోచుకుంది. తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో బీఆర్ఎస్ ఆడుకుంటోంది. ఇప్పుడు కాంగ్రెస్.. తెలంగాణను ఏటీఎంలా మార్చుకుంటోంది. బీఆర్ఎస్‌పై అవినీతి ఆరోపణలు చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆ ఫైల్స్‌ను పక్కన పెడుతోంది. కాళేశ్వరం అవినీతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయి. లిక్కర్ స్కామ్‌లోనూ బీఆర్ఎస్ కమీషన్లు తీసుకుంది. బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ దర్యాప్తు చేయడం లేదు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు నన్ను దూషించడమే పనిగా పెట్టుకున్నాయి. కాళేశ్వరంలో బీఆర్ఎస్ అవినీతికి పాల్పడింది. ఇక్కడ దోచిన డబ్బును కుట్రలకు వాడుతున్నారు. తెలంగాణ నుంచి డబ్బులు ఢిల్లీలో కుటుంబ పార్టీ పెద్దలకు వెళ్తున్నాయి. దేశంలో జరిగిన స్కామ్‌లన్నింటికీ కుటుంబ పార్టీలే కారణం. శివాజీ మైదానంలో రాహుల్ గాంధీ.. తన పోరాటం శక్తికి వ్యతిరేకం అని చెప్పారు. శక్తిని వినాశనం చేసేవాళ్లకు.. శక్తికి పూజ చేసే వాళ్లకు మధ్య పోరాటం జరగబోతుంది. నాకు ప్రతీ మహిళా.. ఒక శక్తి స్వరూపంలా కనిపిస్తుంది. శక్తిని ఖతమ్ చేస్తామన్న రాహుల్ గాంధీ ఛాలెంజ్‌ను నేను స్వీకరిస్తున్నాను. చంద్రయాన్ విజయవంతమైన ప్రాంతానికి కూడా శివశక్తి అని పేరు పెట్టాను. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందో.. జూన్ నాలుగో తేదీన తెలుస్తుంది. నేను భారతమాతకు పూజారిని' అంటూ కామెంట్స్ చేశారు.



### ప్రధాని మోడీ ఏ జగిత్యాల సభ

నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య పండుగ మొదలైంది తెలంగాణ ప్రజలు కొత్త ఇతిహాసాన్ని లిఖించేందుకు సిద్ధమయ్యారు వికసిత భారత్ లో భాగంగా దేశం అభివృద్ధి చెందితే.. తెలంగాణ కూడా అభివృద్ధి చెందుతుంది నేను గత మూడ్రోజుల పర్యటనలో భాగంగా తెలంగాణకు మరోసారి వచ్చాను ఆదిలాబాద్ తో పాటు దేశవ్యాప్తంగా వేల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాం తెలంగాణలోని ప్రతి మారుమూల ప్రాంతం అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో అభివృద్ధి పనులు చేపట్టాం తెలంగాణలో బీజేపీని గెలిపించి.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ను సాఫ్ చేయండి 4 జూన్ కో.. 400 పార్.. బీజేపీకి ఓటు వేయాలని తెలుగులో కోరిన ప్రధాని నా ముందు శక్తి స్వరూపులైన వేషధారణలో ఉన్న చిన్నారి ఉంది.. ఆమెతో పాటు ఇంతమంది శక్తి స్వరూపులైన మహిళలు నన్ను ఆశీర్వదించేందుకు వచ్చారు నిన్న ముంబైలో ఇండి అలయన్స్ ర్యాలీ జరిగింది ఆ ర్యాలీలో మేనిఫెస్టో రిలీజ్ చేశారు వారు శక్తిని ఖతం చేయడానికి యుద్ధం చేస్తున్నారు కానీ నాకు శక్తి స్వరూపులైన మహిళలంతా అండగా ఉన్నారు నేను శక్తి స్వరూపులైన మిమ్మల్ని పూజిస్తాను భారత మాతకు, శక్తి స్వరూపులైన మహిళలకు పూజారిని ఈ ఎన్నికల్లో ఇండి అలయన్స్ శక్తిపై చేస్తున్న యుద్ధాన్ని స్వీకరిస్తున్నాను ఈ యుద్ధంలో నేను మీకోసం ప్రాణాలర్పించేందుకైనా సిద్ధమే.. భారత గడ్డపై శక్తిని వినాశనం చేస్తానని మాట్లాడుతున్నారు యావత్ దేశం శక్తిని పూజిస్తాం శివశక్తి పేరుతో చంద్రయాన్ సక్సెస్ చేసుకున్నాం శక్తిని వినాశనం చేసే అవకాశం వారికిద్దామా? శక్తిని విచ్?ఛిన్నం చేసే వారు విచ్ఛిన్నం కావాలా? వద్దా? ఈ యుద్ధంలో శక్తిని పూజ చేసే వారు ఒక వైపు.. శక్తిని విచ్ఛిన్నం చేసేవారు ఒకవైపు ఈ యుద్ధంలో గెలుపెవరిదో జూన్ 4వ తేదీన తేలనుంది తెలంగాణ పుడమి సాధారణమైనది కాదు ఆంగ్లేయులు, రజాకార్ల అత్యాచారాలపై పోరాడిన గడ్డ తెలంగాణ కలలను కల్లలు చేసింది కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది బీఆర్ఎస్.. రాష్?ట్రాన్ని దోచుకుంది ఇప్పుడు కాంగ్రెస్.. తెలంగాణను ఏటీఎంలా మార్చుకుంది ఇక్కడి ప్రజలు డబ్బులు ఢిల్లీకి చేరుతున్నాయి కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీలకు చేరుతున్నాయి అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పై అవినీతి ఆరోపణలు చేసింది.. కానీ ఇప్పుడు అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఇదంతా ప్రజలు గమనిస్తున్నారు బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ నోరు మెదపడం లేదు కాళేశ్వరం అవినీతిపై ఎవరూ ప్రశ్నించడంలేదు ఎన్నో గ్యారెంటీలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వాటిని అమలుచేయడం లేదు దీనిపై బీఆర్ఎస్ కూడా నోరుమెదపడం లేదు ఈరెండు పార్టీలు ఒకరినొకరు కాపాడుకుంటున్నాయి ఈ రెండు పార్టీలకు మోడీని తిట్టడం తప్పితే వేరే పనిలేదు ఈ పార్టీల నాయకులు ఎన్నడైనా భారత్ మాతా కీ జై అనడం వినిపించిందా? ఈ రెండు పార్టీలు ఎన్ని కవర్ ఫైర్లు చేసినా మేం బయటకుతీస్తాం తెలంగాణను దోచుకున్న వారిని విడిచిపెట్టం.. ఇది మోడీ గ్యారెంటీ కుటుంబ పార్టీలు కేవలం దేశాన్ని దోచుకునేందుకు రాజకీయం చేస్తాయి, అభివృద్ధి కోసం పనిచేయవు దేశంలో అవినీతి ఎక్కడ జరిగినా దాని వెనుక కుటుంబ పార్టీ హస్తం ఉంటుంది నేను దీనిపై మీడియా వారికి కూడా హోంవర్క్ ఇస్తున్నా.. కావాలంటే చూసుకోవచ్చు 2జీ స్కామ్, బోఫోర్స్, నేషనల్ హెరాల్డ్ కేసులో ఎవరి పేర్లొచ్చాయి? ఇలాంటి అవినీతే.. తెలంగాణలోనూ జరిగింది కాళేశ్వరం అవినీతితో పాటు లిక్కర్ స్కామ్ తో ఢిల్లీ వరకు వచ్చి కమీషన్లు తిన్నారు

కాంగ్రెస్.. అయినా.. బీఆర్ఎస్ అయినా.. వారికి దూరంగా ఉండటమే మనకు మెడిసిన్. అందుకే బీజేపీని గెలిపించాలి శక్తిని వచ్ఛిన్నం చేసే వారిని విచ్ఛిన్నం చేసేందుకు నాకు మీ ఆశీర్వాదాలతో శక్తినివ్వండి కుర్చీతో సంబంధం లేకుండా మీ బాగు కోసం నేనుంటా గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పై కోపంతో ఎలాగైనా ఆ పార్టీని ఓడించాలనుకున్నారు.. ఓడించారు కానీ ఈసారి జరిగేవి కేంద్రంలో మరోసారి మోడీ సర్కారును తెచ్చేది అందుకే బీజేపీకి ఓటు వేయండి 2014కు ముదు వరకు ఇతర పార్టీలు చేసిన అభివృద్ధి చూడండి 2014 తర్వాత నుంచి కేవలం పదేండ్లలో జరిగిన అభివృద్ధి చూడండి జూన్ లో మరోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుంది.. మరింత అభివృద్ధి చేపడుతాం.. బండి సంజయ్, అర్వింద్, గోమాస శ్రీనివాస్ ను తమ్ముళ్లుగా పిలిచి.. మరీ అభ్యర్థులను పరిచయం చేసిన మోడీ నేను టెక్నాలజీ వినియోగించి మీతో తెలుగులో మాట్లాడుతాను ట్విట్టర్(ఎక్స్) వేదికగా 'నమో ఇన్ తెలుగు' డౌన్ లోడ్ చేసుకోండి వందకు వంద శాతం కాకపోయినా.. 80 నుంచి 90 శాతం వరకు ఇది సక్సెస్ అవుతుంది అందులో ఏమైనా తప్పులు ఉంటే నాకు చెప్పండి మీరు నా టీచర్లు.. నాకు తెలుగు నేర్పిస్తారు కదా.. ఎవరైనా ఏమైనా అంటే.. గడ్ బడ్.. చేయకు.. మోడీ నా జేబులో ఉన్నాడని చెప్పండి తెలంగాణలోని ప్రతి మొబైల్ లో మోడీ ఉండాలి మీ మొబైల్ ఫ్లాష్ లైట్లు ఆన్ చేసి నాకు అండగా ఉంటానని గ్యారెంటీ ఇవ్వండి ఇండియన్ అలయెన్స్‌కు నామారూపాల్లేకుండా చిత్తు చేసేందుకు ఈ నారీశక్తి అంతా ఒక్క తాటిపైకి రావాలి. చంద్రయాన్ సఫలీకృతం కావడంలో కూడా ఈ నారీశక్తిది కీలకపాత్ర. శక్తి వినాశనాన్ని కోరుకునే వారికి ఇక్కడ స్థానం లేదు, వారిని తుదముట్టించాలి. తెలంగాణా ప్రజల కలలను నిర్వీర్యం చేసిన ప్రజా ఘాతకులు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కు తెలంగాణా ఏటీఎం కార్డులా మారింది. తెలంగాణాను మోసం చేయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూదొందే. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే. అందుకే కాళేశ్వరంకు సంబంధించి ఎలాంటి చర్యల్లేవ్. ఆ రెండు పార్టీలు మోదీని తిట్టడం, మోదీ జపం చేయడం మాత్రమే చేస్తున్నాయి. మోదీ తెలంగాణా ప్రజలకు గ్యారంటీ ఇస్తున్నాడు.. తెలంగాణాను దోచుకునే వారినెవరినీ వదిలిపెట్టడని. కాంగ్రెస్ కాదది స్కాంగ్రెస్. ఢిల్లీలో లిక్కర్ స్కాంతో ఇక్కడి బీఆర్ఎస్ ఏం చేసిందో చూశారు. కాబట్టి ఆ రెండు పార్టీలను గెలిపిస్తే అంతే సంగతులు. మీరెన్ని సీట్లలో తెలంగాణాలో బీజేపీని గెలిపిస్తే తెలంగాణాలో అంత అభివృద్ధి జరుగుతుంది. వికసత్ తెలంగాణా కావాలంటే బీజేపీని అత్యంత మెజారిటీతో అన్ని సీట్లలో గెలిపించాలి

## బీఆర్ఎస్‌తో పొత్తు రద్దు చేసుకోవాలని మాయావతి నాపై ఒత్తిడి తెచ్చారు

**కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేసీఆర్**

**జై బీమ్... జై తెలంగాణ అంటూ ప్రసంగం ప్రారంభించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**




బీఆర్ఎస్ పార్టీతో పొత్తును రద్దు చేసుకోవాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి తనపై ఒత్తిడి తెచ్చారని అందుకే ఆ పార్టీని వీడినట్లు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన సోమవారం సాయంత్రం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేసీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జై బీమ్... జై తెలంగాణ అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేశారని, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రానికి బలమైన పునాది వేశారన్నారు. మనకు అవకాశమిచ్చి తెలంగాణలో కేసీఆర్ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. కేసీఆర్ లాగే తాను కూడా మాట ఇస్తే తప్పనన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడిఉంటానని తెలిపారు. బలమైన తెలంగాణ వాదానికి బహుజన వాదం కలిస్తే బాగుంటుందని లోక్ సభ ఎన్నికల కోసం పొత్తు కుదుర్చుకున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్‌తో పొత్తు రద్దు చేసుకోవాలని బీఎస్పీ అధినేత్రి మాయావతి తనపై ఒత్తిడి తెచ్చారన్నారు. అయితే, ఇది తనకు ఇష్టం లేదని, అందుకే బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు బీఎస్పీ నాయకులు, మద్దతుదారులు, అభిమానులు భారీ సంఖ్యలో గులాబీ కండువా కప్పుకున్నారు.

## ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆగ్రహం

**షుగర్ ఫ్యాక్టరీ మూతకు బీజేపీయే కారణమని మండిపాటు**

**ప్రధాని నరేంద్ర మోదీ వేషం ఇప్పటికి రెండుసార్లు చూశామన్న కాంగ్రెస్ నేత**

**జగిత్యాల సభలో మోదీ అన్నీ అబద్ధాలే చెప్పారన్న జీవన్ రెడ్డి**



షుగర్ ఫ్యాక్టరీ మూతకు బీజేపీయే కారణమని... దీనిని మీరే మూసివేసి మీరే తెరుస్తానంటారా? అని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ వేషం ఇప్పటికి రెండుసార్లు చూశామని విమర్శించారు. జగిత్యాల సభలో ఆయన అన్నీ అబద్ధాలే చెప్పారని మండిపడ్డారు. పసుపు సాగు పట్ల రైతులకు నమ్మకం లేదని... పసుపుకు కనీస మద్దతు ధర మోదీ ఇవ్వడం లేదని ఆరోపించారు. పసుపు బోర్డు ఏర్పాటు డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని చెప్పారు. పదేళ్ల అధికారంలో ఉన్నది మీరే కదా... మళ్లీ ఇప్పుడు షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని అంటారేమిటని నిలదీశారు. ఇన్నాళ్ళు షుగర్ ఫ్యాక్టరీని ఎందుకు ఓపెన్ చేయలేదో చెప్పాలన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అయిదేళ్లు ఏం చేశారు? అని ప్రశ్నించారు

## 'ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత క్రియాశీల పాత్ర

-మొదటి పేజి తరువాయి



రూపకల్పనలో కవిత ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) నేతలు సీఎం అరవింద్ కేజ్రీవాల్,మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాతో కలిసి కుట్ర చేశారు. ఈ వ్యవహారంలో ఆప్ పార్టీ నేతలకు 100 కోట్ల రూపాయలు ముడుపులు అప్పజెప్పడంలో కవిత క్రియాశీల పాత్ర పోషించారు. ఈ మొత్తాన్ని హోల్‌సేల్ వ్యాపారుల నుంచి ఇప్పించారు. తిరిగి ఆ డబ్బును లాభాలను రాబట్టుకునేందుకు మరిన్ని కుట్రలు పన్నారు. ఈ కేసులో మనిష్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్ సహా ఇప్పటివరకు 15 మందిని అరెస్టు చేశాం. 245 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించాం. ఒక ప్రాసిక్యూషన్ కంప్లైంట్ ఐదు సప్లిమెంటరీ కంప్లైంట్స్ ఫైల్ చేశాం. కవిత ఏడు రోజుల ఈడి కస్టడీలో ఉంది. ఆమెను అరెస్టు చేసే సమయంలో బంధువులు మాకు ఆటంకం కలిగించారు.

### నిలకడగా కవిత ఆరోగ్యం: వైద్యులు

ఈడీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కవితకు డాక్టర్లు వైద్యపరీక్షలు చేశారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. కవిత బీపీ సాధారణంగా ఉందన్న పేర్కొన్నారు. 24 గంటలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## 'నిజాయితీకి కట్టుబడి ఉన్నా.

-మొదటి పేజి తరువాయి



కుమార్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. గజ్వేల్‌లోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌కు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. 'నిజాయితీకి కట్టుబడి ఉన్నా. ఓ వైపు మంచివాడు అంటూ నన్ను రేవంత్ రెడ్డి విమర్శిస్తున్నారు. స్వార్థం కోసం ఎన్ని కోట్లు తీసుకొని వెళ్తున్నావు అంటూ సోషల్ మీడియాలో అడుగుతున్నారు.డబ్బు కోసం ఆశపడిన వాడిని అయితే కాంగ్రెస్‌లో చేరుతా. బీఆర్ఎస్ కాదు. టీఎస్‌పీఎస్సీ చైర్మర్ ఆఫర్ ఇస్తే.. తిరస్కరించా. నా గుండెల్లో ఎప్పుడూ బహుజన వాదం ఉంటుంది. నేనెప్పుడూ బహుజనులు సంక్షేమం కోసమే పోరాడుతా. రేవంత్ రెడ్డే కాదు నేను కూడా పాలమూరు బిడ్డనే' అని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఇక.. ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌస్‌కు బయలుదేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇతర టీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అనుచరులు అభిమానులు ఉన్నారు.

## సంపాదకీయం

# సుదీర్ఘ ఎన్నికల షెడ్యూల్

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ని ఈసీ వెల్లడించింది. మొత్తం 7 విడతల్లో పోలింగ్ నిర్వహిస్తామని స్పష్టం చేసింది. ఏప్రిల్ 19 న మొదటి విడత మొదలై జూన్ 1న మలి విడత పూర్తవుతుంది. గత లోక్‌సభ ఎన్నికలనూ ఇలాగే 7 విడతల్లో నిర్వహించింది ఈసీ. అన్నివిడతలు అంటే ఎన్నికల ప్రక్రియ చాలా సుదీర్ఘంగా సాగుతుంది. ఈసారి ఈ విడతల్ని తగ్గిస్తుందని భావించినా అదే తరహాలో కొనసాగించనున్నట్టు తెలిపింది. 1951-52 మధ్య కాలంలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు తొలిసారి ఇంత సుదీర్ఘంగా సాగాయి. ఇది రెండో అతి పెద్ద ఎన్నికల షెడ్యూల్. మొత్తంగా చూస్తే 44 రోజుల పాటు పోలింగ్ జరగనుంది. అయితే...నోటిఫికేషన్‌లు, నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ అన్నీ కలుపుకుంటే మొత్తంగా ఈ ఎన్నికల ప్రక్రియ 82 రోజుల పాటు కొనసాగనుంది. ఇన్ని రోజుల పాటు ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నో కారణాలున్నాయి. అందులో ప్రధాన కారణం..గత లోక్‌సభ ఎన్నికలతో పోల్చి చూస్తే...ఈ సారి 6 రోజుల పాటు ఆలస్యంగా షెడ్యూల్‌ని విడుదల చేయడం. నిజానికి ఎప్పటిలాగే ఈ తేదీల్ని విడుదల చేయాలని ఈసీ భావించినా ఉన్నట్టుండి కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేశారు. మొత్తం ముగ్గురు సభ్యులతో కూడిన ఈ ప్యానెల్‌లో అప్పటికే ఓ ప్లేస్ వేకెన్సీ ఉంది. దానికి తోడు అరుణ్ గోయల్ కూడా వెళ్లిపోయారు. ఫలితంగా ఈ రెండు స్థానాల్ని భర్తీ చేయడానికి కాస్త సమయం పట్టింది. ఆ తరవాత సెలెక్షన్ కమిటీ కేరళకి చెందిన జ్ఞానేశ్ కుమార్, పంజాబ్‌కి చెందిన సుఖ్‌భీర్ సింగ్ సంధులను ఎన్నికల కమిషనర్లుగా నియమించింది. మార్చి 14న ఈ నియామకం జరగ్గా మార్చి 15న వాళ్లు బాధ్యతలు తీసుకున్నారు. ఆ మరుసటి రోజే అంటే మార్చి 16న ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఇక మార్చి,ఏప్రిల్ నెలల్లో వరుసగా పండుగలు ఉండడం కూడా ఎన్నికల షెడ్యూల్ గడువుని పెంచడానికి మరో కారణం. హోలీ, తమిళ కొత్త సంవత్సరం, బైశాఖి తదితర పండుగలున్నాయి. ఈ సెలవు రోజులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని షెడ్యూల్‌లో మార్పులు చేసింది ఎన్నికల సంఘం. వీటితో పాటు భద్రతా కారణాలూ ఉన్నాయి. భద్రతా బలగాలు ఓ విడత ఎన్నికలు ముగిశాక మరో విడత ఎన్నికలకు వేరే చోటకు వెళ్లాల్సి ఉంటుంది. ఇదంతా చాలా పకడ్బందీగా జరుగుతుంది. ఇలా ప్రతి రెండు విడతల మధ్య ఓ చోటు నుంచి మరో చోటుకు వెళ్లాలంటే మొత్తంగా ఆరు రోజుల సమయం పడుతోంది. ఈ మధ్యలో పండుగ రోజులున్నాయి. నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ గడువుకి ఎక్కడా ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకుంది ఈసీ. ఫలితంగానే ఇంత సుదీర్ఘంగా ఎన్నికల ప్రక్రియని నిర్వహించాల్సి వస్తోందని ఈసీ వర్గాలు వెల్లడించాయి. జూన్ 1వ తేదీన 7వ దశ పోలింగ్ ముగిసిపోతుంది. జూన్ 4వ తేదీన ఒకేసారి అన్ని ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి. కోడ్ అమల్లోకి వచ్చిన 24 గంటలలోగా ప్రభుత్వ ఆస్తులపై గల అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలు వంటివన్నీ తొలగించాలి పబ్లిక్ ఆస్తులు- బహిరంగ ప్రదేశాలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రైల్వే, రోడ్డు వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లోని అన్ని రకాల రాజకీయ పరమైన అడ్వర్టైజ్మెంట్లు, రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు వంటివన్నీటినీ వెంటనే తొలగించాలి.ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రసార మాధ్యమాల్లో ప్రభుత్వ నిధులతో జారీ చేసే అన్ని రకాల అడ్వర్టైజ్మెంట్లను నిలిపి వేయాలిప్రభుత్వ వెబ్ సైట్ లో మంత్రులు తదితర ప్రజా ప్రతినిధులు,రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫోటోలను వెంటనే తొలగించాలిఎన్నికల ప్రకటన వచ్చాక మంత్రులెవరూ అధికారిక వాహనాలను ఎన్నికల ప్రచారం వినియోగించరాదు ఎలాంటి లోపాలు లేకుండా ఎన్నికలు జరపాలన్నదే తమ లక్ష్యమని ఎన్నికల సంఘం ప్రధానాధికారి రాజీవ్ కుమార్ అన్నారు. అభ్యర్థుల వివరాలు ఓటర్లు తెలుసుకోవచ్చని చెప్పారు. కేవైసీ యాప్ లో అన్ని వివరాలు ఉంటాయన్నారు. ఎవరైనా తాయిలాలు, నగదు పంచితే ఫొటో తీసి తమకు పంపాలని రాజీవ్ కుమార్ కోరారు. సెల్ ఫోన్ లొకేషన్ ను బట్టి 100 నిమిషాల్లో ఆ ప్రాంతానికి చేరుకుంటామని చెప్పారు. ధనబలం, కండబలం నియంత్రణ తమ ముందు ఉన్న పెద్ద సవాల్ అని తెలిపారు. సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు స్వీకరిస్తామని వివరించారు. ఓటర్లు ఫేక్ న్యూస్ ను షేర్ చేయకూడదని అన్నారు. తప్పుడు ప్రచారం వ్యాప్తి చేసే వారిపై నిఘా ఉంటుందని తెలిపారు.

# తెలంగాణ సాయుధ పోరాటంలో తుపాకీ పట్టిన తొలిమహిళ మల్లు స్వరాజ్యం



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, స్వాతంత్ర సమర యోధురాలు మల్లు స్వరాజ్యం.. ప్రస్తుత సూర్యాపేట జిల్లాలోని కర్విరాల కొత్తగూడెంలో ఓ భూస్వామ్య కుటుంబంలో 1931 లో మల్లుస్వరాజ్యం జన్మించారు. వీరికి వందలాది ఎకరాల భూమి కలదు వీరిది భూస్వామ్య కుటుంబం. ఐదో తరగతి వరకే చదువుకున్న ఆమె.. తన సోదరుడు భీమిరెడ్డి నర్సింహారెడ్డి అడుగుజాడల్లో పోరాట పంథాలోకి వచ్చారు. 1945-48 మధ్య మహోజ్వలంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో తుపాకీ చేతబట్టి ఎందరో మహిళలకు ప్రేరణగా నిలిచారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రజల్ని కదిలించేలా సభలు నిర్వహించేవారు. ఆనాటి రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా బతుకమ్మ పాటలతో ఉర్రూతలూగించే ఉపన్యాసాలతో మహిళల్ని చైతన్యపరచడం లో కీలక పాత్ర పోషించారు. ఆమె నైజాం సర్కార్‌కి వ్యతిరేకంగా పోరాడారు. దొరల దురహంకారంపై తన పాటలతో ప్రజలను చైతన్యపరిచారు. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో స్వరాజ్యం పనిచేశారు. సాయుధ పోరాటంలో తుపాకీ పట్టిన తొలిమహిళగా స్వరాజ్యం పేరుతెచ్చుకున్నారు. మహిళా కమాండర్‌గా పనిచేశారు. ఆమెను పట్టించిన వారికి నైజాం సర్కార్ పదివేల రివార్డు కూడా ప్రకటించింది. సాయుధ పోరాట కాలంలో మల్లు స్వరాజ్యంతో పాటు మూడువందల మంది మహిళలు మేజర్ జైపాల్ సింగ్ ఆధ్వర్యంలో సాయుధ శిక్షణ పొందారు. 75 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ, ప్రజాప్రస్థానంలో ఆమె రెండు సార్లు (1978, 1983లలో) తుంగతుర్తి శాసనసభ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మిర్యాలగూడ పార్లమెంటుకు పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన మద్యపాన వ్యతిరేక పోరాటంలో మల్లు స్వరాజ్యం ప్రముఖ పాత్ర పోషించారు.అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) నాయకురాలిగా అనేక మహిళా సమస్యలపై పోరాటాలు చేశారు. మల్లు స్వరాజ్యం భర్త మల్లు వెంకట నర్సింహారెడ్డి (వీఎన్ ) ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నల్లగొండ జిల్లా సీపీఎం కార్యదర్శిగా పనిచేశారు. ఆయన2004 డిసెంబర్ 4న మరణించారు. వీరికి ఒక కుమార్తె పాదూరి కరుణ, ఇద్దరు కుమారులు మల్లు గౌతంరెడ్డి (వైద్యుడు), మల్లు నాగార్జున రెడ్డి (న్యాయవాది) ఉన్నారు. కుమార్తె భాజపాలో ఉండగా.. చిన్న కుమారుడు నాగార్జున రెడ్డి సూర్యాపేట జిల్లా సీపీఎం కార్యదర్శిగా కొనసాగుతు న్నారు. ఆమె ఆత్మకథ నా మాటే తుపాకీ టూటా (నా మాట ఒక బుల్లెట్) హైదరాబాద్ బుక్ ట్రస్ట్ 2019లో ప్రచురించింది. స్వరాజ్యం తన 91వ ఏట 19 మార్చి 2022న హైదరాబాద్‌లో బహుళ అవయవ వైఫల్యంతో మరణించింది. ఆమె శరీరం వైద్య పరిశోధన కోసం నల్గొండలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు దానం చేయబడింది.

# 265 మందితో..బీజేపీ... 82 మంది కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు




**న్యూఢిల్లీ :** ఎన్నికల తేదీలు ప్రకటించక ముందే అత్యధికంగా అభ్యర్థులను ప్రకటించిన పార్టీ భారతీయ జనతా పార్టీ. బీజేపీ మొత్తం 267 మంది అభ్యర్థులను ప్రకటించింది. అయితే అసన్‌సోల్ 2 స్థానాల నుంచి పవన్ సింగ్, బారాబంకి నుంచి ఉపేంద్ర రావత్ తమ పేర్లను ఉపసంహరించుకున్నారు. ఇప్పటి వరకు బీజేపీ 265 మంది అభ్యర్థులను బరిలోకి దింపింది.ఎన్నికల తేదీ ప్రకటించకముందే భారతీయ జనతా పార్టీ యాభై శాతానికి పైగా అభ్యర్థులను రంగంలోకి దించింది. బీజేపీ తొలిసారిగా మార్చి 2న 195 స్థానాల్లో అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. వీరిలో 34 మంది కేంద్ర మంత్రులు ఉన్నారు. తొలి జాబితాలో వారణాసి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ, గాంధీనగర్ నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ ఎంపీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, బిప్లబ్ దేబ్, సర్బానంద సోనోవాల్ వంటి ప్రముఖులు ఉన్నారు. బుధవారం, మార్చి 13న బీజేపీ తన రెండవ జాబితాలో 72 మంది అభ్యర్థులను ప్రకటించింది. రెండో జాబితాలో నాగ్‌పూర్‌కు చెందిన నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, అనురాగ్ ఠాకూర్, మనోహర్ లాల్ ఖట్టర్ ఉన్నారు. గతంలో హర్యానా ముఖ్యమంత్రి పదవికి మనోహర్ లాల్ రాజీనామా చేశారు.బీజేపీ అభ్యర్థులను నిలబెట్టిన స్థానాల్లో 57 మంది ఓబీసీ, 28 మహిళలు, 27 షెడ్యూల్డ్ కులాలు, 18 షెడ్యూల్డ్ తెగలకు చెందనవారికి అవకాశం కల్పించారు. ఢిల్లీలోని మొత్తం 7 స్థానాల్లో పార్టీ తన అభ్యర్థులను నిలబెట్టింది. అందులో మనోజ్ తివారీకి మాత్రమే మళ్లీ టిక్కెట్ లభించింది. మిగిలిన 6 మంది కొత్త ముఖాలను రంగంలోకి దింపారు. ఎన్డీయేకు 400 దాటాలనే నినాదాన్ని ప్రధాని మోదీ ఇచ్చారు. ఈ దిశగా ఆ పార్టీ నిరంతరం ప్రచారం నిర్వహిస్తోంది.మల్కాజిగిరి ? ఈటల రాజేందర్ చేవెళ్ల ? కొండా విశ్వేశ్వర రెడ్డి జహీరాబాద్ ? బీబీ పాటిల్ సికింద్రాబాద్ ? జి. కిషన్ రెడ్డి హైదరాబాద్ ? డాక్టర్ మాధవీలత భువనగిరి ? బూర నర్సయ్య గౌడ్ నాగర్‌కర్నూల్ ? భరత్ నిజామాబాద్ ? ధర్మపురి అర్వింద్ కరీంనగర్ ? బండి సంజయ్ కుమార్ ఆదిలాబాద్ ? గోడెం నగేశ్ పెద్దపల్లి ? గోమాస శ్రీనివాస్ మెదక్ ? రఘునందన్ రావు నల్లగొండ ? శానంపూడి సైదిరెడ్డి మహబూబ్‌నగర్ ? డీకే అరుణ మహబూబాబాద్ ? సీతారాం నాయక్‌మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా తన అభ్యర్థుల రెండు జాబితాలను విడుదల చేసింది. మార్చి 8న కాంగ్రెస్ తొలి జాబితాను విడుదల చేసింది. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఎన్నికల పొత్తు ఉంది. మార్చి 7న కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం జరిగింది. మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. దీని తర్వాత ప్రకటించిన తొలి జాబితాలో ఛత్తీస్‌గఢ్, కేరళ, మేఘాలయ, కర్ణాటక, సిక్కిం, తెలంగాణ, త్రిపురలలో లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించింది. తొలి జాబితాలో 39 మంది అభ్యర్థులు 15 జనరల్, 24 ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారు. తొలి జాబితాలో రాహుల్ గాంధీ వయనాడ్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. కానీ యూపీలోని అమేథీ, రాయ్‌బరేలీలో కాంగ్రెస్ అభ్యర్థికి ఆమోదం లభించలేదు.కాంగ్రెస్ రెండో జాబితా మార్చి 12న వచ్చింది, అందులో 43 మంది అభ్యర్థులను ప్రకటించారు. ఈ జాబితాను పరిశీలిస్తే, జనరల్ కేటగిరీకి చెందిన అభ్యర్థులు 7 మంది, ఇతర వెనుకబడిన తరగతులు 13, షెడ్యూల్డ్ కులాలు 10, షెడ్యూల్డ్ తెగలు 9, ముస్లిం అభ్యర్థి ఒకరు ఉన్నారు. ప్రముఖులలో, కాంగ్రెస్ మళ్లీ కమల్ నాథ్ కుమారుడు నకుల్ నాథ్‌కు చింద్వారా నుండి టిక్కెట్ ఇచ్చింది. ఇటీవల నకుల్‌నాథ్ బీజేపీలో చేరుతారనే చర్చ సాగింది. అయితే కమల్‌నాథ్ దీనిని ఖండించారు. ఆయనతో పాటు గౌరవ్ గొగోయ్, అశోక్ గెహ్లాట్ కుమారుడు వైభవ్ గెహ్లాట్‌లకు కూడా టిక్కెట్లు ఇచ్చారు.తెలంగాణలో మొత్తం 17 ఎంపీ స్థానాలు ఉండగా.. ప్రస్తుతం 4 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. జహీరాబాద్ సురేశ్ కుమార్ షేట్కర్, నల్గొండ కుందూరు రఘువీర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ చల్లా వంశీచందర్‌రెడ్డి, మహబూబాబాద్ నుంచి బలరాం నాయక్‌లను అభ్యర్థులుగా అధిష్ఠానం ఖరారు చేసింది.ఉత్తరప్రదేశ్‌లోని భారత కూటమిలో సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటివరకు 42 స్థానాల్లో తన అభ్యర్థులను నిలబెట్టింది. ఇలా యూపీలో మాత్రమే ఎస్పీ 70 శాతానికి పైగా అభ్యర్థులను నిలబెట్టగా.. శనివారం ఎన్నికల షెడ్యూల్ తేదీల ప్రకటన అనంతరం ఎస్పీ మరో 6 మంది అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో ధర్మేంద్ర యాదవ్‌కు అజంగఢ్ నుంచి టికెట్ దక్కింది. వీరితో పాటు డాక్టర్ మహేంద్ర నగర్, భీమ్ నిషాద్, జితేంద్ర దోహ్రే, నారాయణ్ దాస్ అహిర్వార్ మరియు మనోజ్ కుమార్ రాజ్‌వంశీ ఉన్నారు. దీంతో సమాజ్‌వాదీ పార్టీ ఇప్పటి వరకు ఐదు జాబితాలను విడుదల చేసిందియూపీలో కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి. మొత్తం 80 స్థానాల్లో ఎస్పీ 62 స్థానాల్లో, కాంగ్రెస్ 17 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ ఇక్కడ టీఎంసీకి ఒక్క సీటు ఇచ్చింది. ఇక మాయావతి బీఎస్పీ విషయానికి వస్తే, ఇక్కడ ఒక్క అభ్యర్థిని కూడా నిలబెట్టలేదు. దీంతో ఎన్నికల రేసులో బీఎస్పీ సున్నా శాతంతో అట్టడుగున ఉంది.ఈ పార్టీలు కాకుండా, పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 42 స్థానాలకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన అభ్యర్థులను ప్రకటించారు. ఈ విధంగా రాష్ట్రంలో 100 శాతం సీట్లపై టీఎంసీ తన అభ్యర్థులను నిలబెట్టింది. ఇక్కడ కాంగ్రెస్‌తో ఆ పార్టీ పొత్తు పెట్టుకోలేదు. మరోవైపు, పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ కూడా 11 మంది అభ్యర్థులకు గాను 8 మందిని బరిలోకి దింపింది. ఇవే కాకుండా యూపీలోని ఎన్డీఏలోని భాగస్వామ్య పార్టీల్లో ఆర్ఎల్‌డీ ఇప్పటికే 2 సీట్లను ప్రకటించింది. అయితే బీహార్‌లో అభ్యర్థులను ఇంకా ప్రకటించలేదు

# ఉషశ్రీ పురాణ వ్యాఖ్యానాలు

తెలుగు వారికి పరిచయం అక్కర్లేని పేరు ఉషశ్రీ. తెలుగునాట ప్రఖ్యాతి గాంచిన రేడియో వ్యాఖ్యాతగా, సాహిత్య రచయితగా, తమ రామాయణ భారత ప్రవచనాల ద్వారా తెలుగుసీమలో ఉషశ్రీ అందరికీ సుపరిచితులు. ఆప్పట్లో ఆయన గొంతుని, మాట సరళిని గుర్తు పట్టలేని తెలుగు శ్రోతలు లేరంటే అది అతిశయోక్తి కానేకాదు. ధర్మ సందేహాలు అనే పదబంధం వినబడితే ఉషశ్రీ గుర్తుకు రాక మానరు. ఆకాశవాణి ద్వారా ఆ కార్యక్రమాన్ని అంతగా ప్రాచుర్యం గావించారు ఉషశ్రీ.పురాణ ప్రవచనంలోనే కాక ప్రత్యక్ష వ్యాఖ్యానాల లోనూ తెలుగు శ్రోతలపై చెరగని ముద్ర వేసిన 'గళగంధర్వుడు' ఉషశ్రీ. తెలుగు దేశంలో రేడియో స్వర్ణయుగ వైభవాన్ని శిఖరస్థాయికి చేర్చిన దిగ్గంతులలో అగ్ర తాంబూలం ఆయనదే అనడం అతిశయోక్తికాదు. ఉషశ్రీ (మార్చి 16, 1928 - సెప్టెంబరు 7, 1990) అసలు పేరు పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా కాకరపర్రు అగ్రహారంలో 1928 (ప్రభవ తెలుగు సంవత్సరం) సంవత్సరం మార్చి 16 (ఫాల్గుణ బహుళ త్రయోదశి) న జన్మించారు. తండ్రి ఆయుర్వేద వైద్యులు పురాణపండ రామూర్తి, తల్లి కాశీ అన్నపూర్ణ. వారికి నలుగురు సంతానం. డాక్టర్ గాయత్రి, పద్మావతి, వైజయంతి, కళ్యాణి. జాతీయోద్యమ సమయంలో కాకినాడలో కాంగ్రెస్ పార్టీకి ప్రతినిధిగా పని చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక వేదికల ద్వారా రామాయణం, మహాభారతం మహాభాగవతం ప్రవచనం చేశారు. ఆకాశవాణిలో పని చేస్తున్నప్పుడు భారత, రామాయణ, భాగవతాలను ప్రతి వారం సీరియల్‌గా చెపుతూ, అశేష తెలుగు శ్రోతలను ఉర్రూత లూగించారు. పురాణాలను పుక్కిట పట్టిన సాహితీ ద్రష్ట. రామాయణ భారతాలు పనికిమాలిన గ్రంథాలు అని నిరసించే హేతు వాదులనూ, అవి పరమ పవిత్రమయిన మత గ్రంథాలు అని గుడ్డిగా ఆరాధించే చాందసులను ఇద్దరినీ సమానంగా నిందించి, ఈ రామాయణ భారతాలు మానవజాతి సర్వకాలాల లోనూ సుఖశాంతులతో మనుగడ సాధించడానికి అవసరమయిన విశేషాలను అందించే గ్రంథాలు మాత్రమే అనీ, అందుచేతనే ఇవి ఇన్నివేల సంవత్సరాలు జీవించ గలిగాయనీ ఉషశ్రీ స్పష్టం చేశారు. రేడియోలో ఉషశ్రీగా పేరొందక ముందు కవిత్వం, గేయాలు, యక్షగానాలు, ఎన్నో కథలు, నవలికలు రాసారు. ఎమెస్కో వారు కూడా ఎన్నో ప్రచురించారు. రేడియోలో వార్తలు కూడా చెప్పేవారు. రేడియో నాటకాలు రాసేవారు. రేడియో నాటకాల్లో పాల్గొనేవారు.1973 లో రేడియోలో భారత ప్రవచనం ప్రారంభించాడు. ఉషశ్రీ పురాణ ప్రవచనాలు వారానికి ఒకసారి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వచ్చేది. అప్పట్లో, దూరదర్శన్ లేదు. ఉషశ్రీ పురాణ ప్రవచనాలు వారానికి ఒకసారి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వచ్చేది.

# స్థానిక వార్తలు

## కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదు

**కాంగ్రెస్ మహిళా నాయకురాలు గునుగుల స్వరూప రెడ్డి**

**వాస్తవ నేస్తం,అనంతగిరి:** కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు గునుగుల స్వరూప రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. శాంతినగర్ గ్రామానికి చెందిన సిపిఐ నాయకుడు, మాజీ సర్పంచ్ బద్దం కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీపై కాంగ్రెస్ పార్టీ నాయకులు పై శనివారం నాడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కోదాడ నుండి ఖమ్మం వరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 365/ఏ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా శాంతినగర్ లోని సుమారు 70 ఇళ్లను తొలగించారని ఇట్టి ఇళ్లకు పూర్తిగా నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించినప్పటికీ మాజీ సర్పంచ్ తన ఇంటిని మాత్రం కొంతమేర తొలగించకుండా అడ్డుపడటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం వంద శాతం ఇంటికి పూర్తిగా నష్ట పరిహారం అందిపుచ్చుకొని కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.ఇంటిని తొలగించకుండా అడ్డుపడటమే కాకుండా కాంగ్రెస్ పార్టీపై, పార్టీ నాయకులు పై బురద జల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యే అనీల్ జాదవ్**



**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** మండల కేంద్రంలో శివరాజ్, నవదుర్గ స్వయం సహాయక గ్రూపు సభ్యులు ఏర్పాటు చేసిన అకీరా మిల్క్ పనీర్ తయారు కేంద్రాన్ని సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనీల్ జాదవ్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడం గొప్పవిషయం అని స్వేచ్ఛమైన పన్నీరు ఇక్కడ లభిస్తుందని చుట్టుపక్కల మండలాల వ్యాపారస్తులు, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో పీఏసిఎస్ చైర్మన్ ముండే సంజీవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** ఇఫ్తార్ విందు సోదర భావాన్ని పెంపొందిస్తాయని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని లాల్ సాబ్ గడ్డ 24 వ వార్డులో ఎంఐఎం మాజీ కౌన్సిలర్ మహమ్మద్ నజీముద్దీన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లిం మత పెద్దలతో కలిసి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మతసామరస్యానికి ప్రాతిక ఇఫ్తార్ విందు అని చింతా ప్రభాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో కసాల బుచ్చిరెడ్డి, మక్ సుధున్ అబ్దుల్లా, కో ఆప్షన్ లు షకీల్, గోవర్ధన్ నాయక్, నర్సింలు, మసూద్, జలెందర్, చక్రపాణి, నాని, సమి, అజీమ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్నం చేసుకొనేందుకు మల్లారెడ్డి కష్టాలు

**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇబ్బంది ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి. బీఆర్ఎస్ నుంచి మేడ్చల్ బరిలో నిలిచి గెలిచిన మల్లారెడ్డి గెలిచినా.. ఆ పార్టీ మాత్రం అధికారంలోకి రాలేదు. దీంతో మల్లారెడ్డికి కష్టాలు మొదలయ్యాయి. ప్రజావాణిలో మల్లారెడ్డి కబ్జాలు, దౌర్జన్యాలపై ప్రజలు, సంఘాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. వెతకబోయిన తీగ కాలికి తగిలినట్లుగా మల్లారెడ్డిని ఎలా పట్టుకోవాలని చూస్తున్న రేవంత్ సర్కార్క ఈ ఫిర్యాదులే ఆధారమయ్యాయి. దీంతో మల్లారెడ్డి కబ్జాలపై ప్రభుత్వం కొరఢా ఝుళిపిస్తోంది. ఇటీవలే మల్లారెడ్డి కొడుకు భద్రారెడ్డికి సంబంధించిన కళాశాల భవనాన్ని కూడా అధికారులు కూల్చివేశారు. కబ్జాలన్నీ బయలపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి.మల్లారెడ్డి ఆస్తులపై దర్యాప్తు వేగవంతం కావడంతో ఆయన వెంటనే సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిశారు. తన ఆస్తులపై దాడులు జరుగకుండా సీఎంకు విన్నవించాలని కోరారు. కక్షసాధింపు చర్యలు సరికావని విన్నవించారు. అయితే వేం నరేందర్‌రెడ్డిని కలిసిన తర్వాత కూడా ఎలాంటి ఫలితం కనిపించలేదు. దీంతో కాంగ్రెస్‌లో చేరడానికి కూడా మల్లారెడ్డి సిద్ధమయ్యారు.కాంగ్రెస్‌లో చేరడానికి స్థానిక నేతలు సానుకూలంగా లేరు. ఈ నేపథ్యంలో ఆయన కర్ణాటక డిప్యూటీ సీఎం ద్వారా కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల బెంగళూరుకు వెళ్లి డీకే శివకుమార్‌ను కలిసి తెలంగాణలో జరుగుతున్న పరిణామాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీఎం రేవంత్ తన ఆస్తుల జోలికి రాకుండా చూడాలని విన్నవించినట్లు ప్రచారం జరిగింది. అదే సమయంలో తాను, తన అల్లుడు రాజశేఖరరెడ్డి కాంగ్రెస్‌లో చేరతామని కూడా ప్రతిపాదించారని సమాచారం. అయితే అక్కడి నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ రాలేదని సమాచారం.ఇక వివిధ మార్గాల్లో చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో మల్లారెడ్డి తానే స్వయంగా రేవంత్‌రెడ్డి ప్రసన్నం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రస్‌మీట్‌లో మాట్లాడారు. రేవంత్ సీఎం అవుతారని తాను 2014లోనే చెప్పానని వెల్లడించారు. బొల్లారంలోని తోట ముత్యాలమ్మ దేవాలయంలో దివంతగ ఎమ్మెల్యే సాయన్న ఇచ్చిన విందుకు హాజరైన సందర్భంలో తాను రేవంత్‌రెడ్డితో స్వయంగా మాట్లాడానని తెలిపారు. భవిష్యత్‌లో సీఎం అవుతావని చెప్పినట్లు గుర్తు చేశారు. ఈమేరకు నాటి వీడియోను కూడా విడుదల చేశారు.ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రసన్నం కోసం ప్రయత్నిస్తున్న మల్లారెడ్డి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేశారు. తొడగొట్టి సవాల్ చేశారు. రాయడానికి కూడా వీలుకాని పదాలు వాడారు. అధికారం పోవడంతో ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు.

# బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**జిల్లా అధ్యక్షురాలు అరుణ తార**



**వాస్తవ నేస్తం,కోటగిరి:** రాబోయే ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కామారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు అరుణాతర అన్నారు. పోతంగల్ మండల కేద్రంలో బిజెపి పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆమెతో పాటుగా ఎంబి పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు మాట్లాడుతూ.ఎవరు కూడా వ్యక్తిగత నిర్ణయాలతో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తే పార్టీ ఆదేశాల మేరకు కఠిన నిర్ణయాలు ఉంటాయని.ప్రతి ఒక్కరు స్థానికంగానే ఉంటూ తమకు అప్పగించిన బాధ్యతలకు అనుగుణంగా పనిచేసి పార్టీ గెలుపుకు కృషి చేయాలని అన్నారు.కొత్త,పాత అనే భేదాభిప్రాయాలు పెట్టుకోకుండా ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా జహీరాబాద్ బిజెపి పార్టీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపుకు కృషి చేసి కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జహీరాబాద్ పార్ల మెంటు పరిధిలోని 7 అసెంబ్లీ నియోజక వర్గాలలో కామారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్లో బిజెపి జెండా రెపరెపలాడుతుందని. మిగతా 6 అసెంబ్లీ సెగ్మెంట్లో బిజెపి పార్టీ అధికారిక కార్యక్రమాలు జరగాలంటే జహిరా బాద్ పార్లమెంటు గడ్డపై బిజెపి జెండా ఎగరాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో పోతంగల్ మండల బిజెపి పార్టీ అధ్యక్షులు ప్రకాష్ పటేల్, బాన్సువాడ అసెంబ్లీ సెగ్మెంట్ కన్వీనర్ జీ. శ్రీనివాస్,కో కన్వీనర్లు కాపుగాండ్ల శ్రీనివాస్, జిల్లా నాయకులు,అన్ని మండల అధ్యక్షులు, మండల నాయకులు, శక్తి కేంద్ర ఇంచార్జిలు,వివిధ మోర్చా ల అధ్యక్షులు, భూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులను నట్టేట ముంచిన గ్రోమర్ కంపెనీ



**వాస్తవ నేస్తం,కోటగిరి:** నాసిరకం విత్తనాలు ఇచ్చారంటూ రహదారి పై రైతులు ధర్నా చేయడంతో వ్యవసాయ శాఖ ఏడిఏ వీరస్వామి శనివారం మన గ్రోమోర్ సెంటర్ ను తనిఖీ చేసి సీడ్ సరఫరా చేసిన సంస్థ యాజమాన్య సభ్యులతో మాట్లాడి సీడ్ కు సంబందించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు లైసెన్సును తీసుకొని సోమవారం రావాలని ఆదేశించారు. కాగా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడడం కోసం రైతులు ఉదయం నుండి మార్కెట్ కమిటీ వద్ద వేచి ఉండగా సాయంత్రం సమయంలో రైతు వేదికకు వచ్చినా గ్రోమోర్ ప్రతినిధులును వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో రైతులు నిలదీయగా పొంతన లేని సమాధానం చెప్పి దాటి వేసే ప్రయత్నం చేస్తూ రైతులను హే మార్చడం ప్రయత్నం చేశారు. వ్యవసాయం అధికారు ల ఆదేశాలను సైతం బేఖరత్ చెసి రైతులకు విత్తనాలు సరఫరా చేసిన కంపెనీ యజమానికి బదులు మరో వ్యక్తిని తీసుకునిరాగా రైతులు సీడ్ ప్లాంట్ కు సంబంధించి న లైసెన్సును చూపించాలంటూ డిమాండ్ చేయడంతో తనది ఈ విషయం లో ఎలాంటి ప్రమేయం లేదని తాను ఆ సంస్థలో పనిచేసే ఉద్యోగిని మాత్రమేనని చెప్పడం గమనార్హం. చేసేదేమీ లేక గ్రోమోర్ సెంటర్ ప్రతినిధులు రైతులు అడిగిన విత్తనాలు కాకుండా మరో రకం విత్తనాలు ఇవ్వడం వల్లే ఇదంతా జరిగిందని తమ తప్పేనని ఒప్పుకున్నారు. వారం రోజులలో పూర్తిస్థాయిలో ఫీల్డ్ విజిట్ చేసి నివేదికను తమ సంస్థ యాజమాన్యానికి పంపి రైతులకు న్యాయం చేస్తామని వెల్లడించారు.

## మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలి

**- పదవులతో పార్టీ సేవకులకు న్యాయం**
**- డిసిసి ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ పారా సీతయ్య**



**వాస్తవ నేస్తం,కోదాడ:** కాంగ్రెస్ పార్టీకి తొలి నుంచి సేవలందించే వారిని గుర్తించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్యే పద్మావతిలు వారికి న్యాయం చేస్తున్నారని కోదాడ మాజీ సర్పంచ్ డిసిసి ఉపాధ్యక్షులు పార.సీతయ్య అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు షేక్. జబ్బర్ ను రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గా నియమించిన సందర్భంగా వారి నివాసంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పుష్ప గుచ్చాలు అందజేసి శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో బాల్ రెడ్డి పాలూరి, సత్యనారాయణ, సైదా నాయక్, వెంకట్రావు, యాకుబ్, చింతలపాటి. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీలు





**పరీక్ష కేంద్రాలలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు**

**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి లోని బాలికల ఉన్నత పాఠశాల, ఆర్నాల్డ్ ఉన్నత పాఠశాల (ప్రైవేట్) ల లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ చెన్నూరు రూపేష్ లు తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలలో భద్రత ఏర్పాట్లను, పరీక్షా రాయడానికి వచ్చిన విధ్యార్థులకు ఉండవలసిన తాగునీటి సదుపాయం, అత్యవసర మెడికల్ సేవల ను పరిశీలించారు. తెలంగాణ రాష్ట ప్రభుత్వం జారీచేసిన పరీక్షల నిర్వాహణ గైడ్ లైన్స్ పాటిస్తూ, విధ్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడా నికి కావలసిన అన్నిరకాల ఏర్పాట్లను పరీక్షా కేంద్రాలలో చేసి ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో వుంటుందని, పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింద న్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర ఉన్నటువంటి అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలని ముందుగానే నోటీసులు జారీ చేసి, మూసివేయించడం జరిగింది అన్నారు. విద్యార్థులకు, ఇన్విజిలేటర్స్ మరియు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్స్ ఎవ్వరికి కూడా పరీక్ష కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులుతీసుకురావడానికి అనుమ తులు లేవన్నారు. పరీక్షా కేంద్ర వద్ద ఏమైనాఅవాంఛనీయ, సంఘటనలు జరిగినట్లైతే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీసు వారికి సమాచారం అందించాలని సూచించారు. తెలంగా ణ రాష్ట రోడ్డు రావాణ శాఖ ఆద్వర్యంలో 10వ తరగతి పరీక్ష రాయడానికి వస్తున్న విద్యార్థిని, విధ్యార్థులకు కల్పించిన ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో తాసిల్దార్ దేవదాస్, విద్యాశాఖ సంబంధిత అధికా రులు, శ్రీనివాస్ చార్యులు, విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల కోసం 20 లక్షల దరఖాస్తులు

**నిజామాబాద్ :** తెలంగాణలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో వంద రోజులు పూర్తిచేసుకుంది. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించింది. ప్రస్తుతం అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలోని ప్రతీ పేద కుటుంబానికి తెల్ల రేషన్‌కార్డు అందించాలని రేవంత్ రెడ్డి నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు, ఆరు గ్యారంటీలకు రేషన్‌కార్డు తప్పనిసరి అయింది. ఈ నేపథ్యంలో మరింత మంది పేదలకు రేషన్‌కార్డు ఇచ్చి పథకాలు అందించాలని కాంగ్రెస్ సర్కార్ నిర్ణయించింది. ఇటీవల ప్రజాపాలన దరఖాస్తుల ద్వారా 20 లక్షల మంది కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను స్క్రూటినీ చేసి తర్వాత ఫిజికల్ వెరిఫికేషన్ చేస్తారని తెలుస్తోంది. అర్హులని నిర్ధారణ చేసిన తర్వాత కార్డులు జారీ చేస్తారని తెలుస్తోంది. కానీ, ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ మాత్రమే అందిస్తోంది. ఈ పథకాలన్నీ రేషన్ కార్డు ఉన్నవారికే అందిస్తోంది. దీంతో అర్హత ఉండి రేషన్ కార్డు లేనివారు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా రేవంత్ సర్కార్ పేదలకు కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది.రాష్ట్రంలో ప్రస్తుతం 92 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. అయినా లక్షల మంది కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డు తప్పనిసరి కావడంతో చాలా మంది కార్డు కావాలని కోరుకుంటున్నారు. గడిచిన పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు జారీ చేయలేదు. దీంతో కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. నాలుగు రోజుల క్రితం జరిగిన కేబినెట్ భేటీలో కొత్త రేషన్ కార్డుల జారీపై నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఎంత మందికి కార్డులు ఇస్తారు. అర్హతలు ఏంటి, ప్రమాణాలు ఎలా నిర్ణయిస్తారు అన్న చర్చ జరుగుతోంది.ఇక ప్రభుత్వ ఉద్యోగులు, సొంత ఇల్లు, కారు ఉన్నవారు, ఇన్‌కం ట్యాక్స్ చెల్లించేవారికి కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అలాంటి అనర్హులు ఉంటే వారి కార్డులను తొలగించే అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. దరఖాస్తుదారు ఆర్థిక స్థితిగతులు, జీవన విధానం పరిశీలించిన తర్వాతే అర్హతను నిర్ణయిస్తారని సమాచారం. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు న్యాయం జరిగేలా రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఈమేరకు అధికారులు ప్రక్రియ వేగవంతం చేశారు. త్వరలోనే కార్డులు జారీ చేసే అవకాశం ఉంది.

## కేసీఆర్ ఇంటికే నీటి కష్టాలు

**హైదరాబాద్ :** పది సంవత్సరాలు తెలంగాణ ఎట్లుండే. నీళ్ల తండ్లాట ఉండెన. కరెంటు కోతలు ఉండెన. కంటి నిండా నిద్ర, చేను నిండా నీళ్లు, కావలసినంత కరెంటు.. కానీ ఇప్పుడు ఎలా ఉంది? దయచేసి ప్రజలు గమనించాలి. చర్చ పెట్టాలి. పోరాటాలు చేయాలి" ఇవీ కరీంనగర్ సభలో కేసీఆర్ మాట్లాడిన మాటలు. రాష్ట్రం మొత్తం ఏమో గాని.. కేసీఆర్ సొంత ఇంట్లోనే తాగునీటికి కరువు వచ్చింది. తాగునీటి ట్యాంకర్ వస్తే తప్ప అవసరాలు తీరని పరిస్థితి నెలకొంది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించామని, కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా తెలంగాణలో సాగునీటి కరువును జయించామని.. అప్పట్లో పేజీలకు పేజీలో ప్రకటనలు, పుంఖాను పుంఖాలుగా వార్తలు రాయించుకున్న కేసీఆర్.. తనే తాగునీటి కరువును ఎదుర్కొంటుండడం విశేషం. హైదరాబాదులోని నంది నగర్ లో కేసీఆర్ ఉంటున్న నివాసంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవల కొంతమంది కార్యకర్తలు ఆయనను కలవడానికి వెళ్ళినప్పుడు.. ఆ నివాసంలో తాగునీటి ట్యాంకర్ కనిపించింది. విషయం ఏంటని ఆరా తీస్తే.. కేసీఆర్ ఉంటున్న ఇంట్లో బోరు లో నీరు ఇంకిపోయిందట. తాగునీటి అవసరాలకు ఇబ్బంది ఏర్పడిందట. అందువల్లే ప్రైవేట్ ట్యాంకర్ ద్వారా తాగునీటిని తెప్పించుకుంటున్నారట. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్నాయి.అసలే కేసీఆర్.. మొన్నటిదాకా తెలంగాణకు ముఖ్యమంత్రి.. బంగారు తెలంగాణ ఆవిష్కర్త.. కోటి ఎకరాల మాగాణాన్ని సృష్టించిన ఆధునిక రైతు.. ఆయన ఇంట్లో నీటి కరువు ఏర్పడటం.. దానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు ఒక్కసారి గా సోషల్ మీడియాలో సర్క్యులేట్ కావడంతో చర్చ మొదలైంది.."కాంగ్రెస్ పరిపాలనలో ఇలానే ఉంటుంది. అధికారంలోకి వచ్చి మూడు నెలల కాకముందే నీటి కరవంటే తెలుస్తోంది. దానివల్ల సామాన్య ప్రజల నుంచి కేసీఆర్ వరకు ఇబ్బంది పడుతున్నారు. ఈ వీడియోలు, ఫొటోలు సజీవ సాక్ష్యంగా కనిపిస్తున్నాయని" భారత రాష్ట్ర సమితి అనుకూల నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.మరోవైపు కాంగ్రెస్ అనుకూల నెటిజన్లు.. భారత రాష్ట్ర సమితి అనుకూల నెటిజన్ల పై విరుచుకుపడుతున్నారు. "10 సంవత్సరాల పరిపాలన గొప్పగా చేశామని చెప్పుకున్నారు.

# కూర్చున్నప్పుడు కాళ్లు ఊపుతున్నారా..?



చాలా మందికి చిన్ననాటి నుంచి కొన్ని అలవాట్లు ఉంటాయి. అవి ఎలాంటివి అంటే కొందరు నిత్యం గోళ్లను కొరుకుతుంటారు. ఇలా గోర్లు కొరకడం మంచిది కాదు అని పెద్దలు చెప్పిన వినరు. మరికొందరు అయితే వేళ్లను విరుస్తుండడం వల్ల వచ్చే సౌండ్ తో ఎంజాయ్ చేస్తారు. కొంతమంది పడుకునేటప్పుడు హెడ్ ఫోన్స్ చెవిలో పెట్టుకుని పడుకుంటారు. ఇలా ఎన్నో అలవాట్లు బాల్యదశ నుంచి వచ్చినవే అయినప్పటికీ వాటి వల్ల కొన్ని సమస్యలు కూడా లేకపోలేదు. అంతేకాదు ఇలాంటి అలవాట్లలో ఒకటి కాళ్ళు ఊపడం. అయితే కొందరు ఎప్పుడు కాళ్లు ఊపుతుంటారు. చాలా మంది కుర్చీలో కూర్చున్న సమయంలో కాళ్లను ఊపడం మనం గమనించే ఉంటారు. ఇంకా మరికొందరు నిద్రలో కూడా కాళ్లను ఆడిస్తుంటారు. ఐతే దీని గురించి వైద్యులు ఏం చెబుతున్నారంటే ఇది కేవలం అలవాటు మాత్రమే కాదు. ఓ వ్యాధి అంటున్నారు. కొందరికి సందేహం కలగవచ్చు ఇది చిన్నప్పటి నుంచి ఉన్న అలవాటు ఇది వ్యాధి ఎందుకు అవుతుంది? అని కానీ నిజానికి అది అనారోగ్యానికి సంకేతంగా చెప్తున్నారు ఆరోగ్య నిపుణులు. కొంతమంది వారికి తెలియకుండానే కాళ్లు ఊపుతుంటారు. నిజానికి ఇది వారికి ఒక చిన్న విషయంగా అనిపించవచ్చు. కానీ ఈ హబీట్ కొన్ని రకాల శారీరక రుగ్మతలను కూడా దారితీస్తుంది. ఫ్రెండ్స్ తో మాట్లాడుతున్నప్పుడు, పుస్తకం చదువుతున్నప్పుడు, మొబైల్ చూస్తున్నప్పుడు సోఫాలో కూర్చుని టీవీ చూస్తున్నప్పుడు కొందరు కాళ్లు ఆడిస్తూ ఉంటారు. అది మంచి పద్ధతి కాదు అని పెద్దలు చెప్పిన మళ్లీ అలానే చేస్తారు. ఎందుకంటే మీకు తెలియకుండానే కాళ్లు ఊపుతూ ఉంటారు. ఇలా కాళ్లను నిత్యం ఆడించడాన్ని వైద్య పరిభాషలో రెస్ట్‌లెస్ లెగ్స్ సిండ్రోమ్‌గా చెపుతారు. ఇది నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యగా చెబుతారు. ఈ సిండ్రోమ్ నిద్రలేమి సమస్యలకు లక్షణంగా చెబుతున్నారు. నిద్రలేమితో బాధపడే వారిలో ఇలాంటి లక్షణం కనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. అంతే కాదు ఒత్తిడి, ఆందోళన ఉన్నవారు కూడా నిత్యం కాలు కదిలిస్తుంటారు. హార్మోన్ల అసమతుల్యత వల్ల కూడా కొందరికి కాళ్లు ఊపుతుంటారు. అందుకే ఎక్కువ కాలం ఈ సమస్యతో బాధపడితే వెంటనే వైద్యున్ని సంప్రదించాలని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్య ఐరన్ లోపం వారిలో కనిపిస్తుంది. ఐరన్ మాత్రలు సరిగ్గా తీసుకోవడం వల్ల ఈ సమస్యను తగ్గించుకోవచ్చని చెబుతున్నారు. అంతే కాకుండా ఐరన్ మాత్రలతో పాటు ఐరన్ అధికంగా లభించే పండ్లను తీసుకోవడం మంచిది. ఇంక ఈ సమస్యతో బాధపడుతున్న వారు టీ, కాఫీలు తాగడం తగ్గించాలి. నైట్ టైం లో మొబైల్ వాడకాన్ని మానుకోవాలని సూచించారు. ఇవన్నీ పాటించినప్పుడే మీరు ఈ సమస్య నుంచి బయటపడగలరని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## నక్షత్రాన్ని మార్చబోతున్న శనిదేవుడు..



పురాణాల ప్రకారం శనిని, సూర్యదేవుని కుమారుడని చెబుతుంటారు. అతని అనుగ్రహం ఉంటే బిచ్చగాడు కూడా కోటీశ్వరుడు అవుతాడు. శని వక్రదృష్టి ఎవరి మీద పడితే వాళ్లు దరిద్రులుగా మారిపోతారు. శని భగవానుడిని కర్మఫలధాత అని పిలుస్తారు. ఎందుకంటే అతను మన చర్యలను బట్టి మనకు ఫలితాలను ఇస్తాడు. త్వరలో శనిదేవుడు నక్షత్రాన్ని మార్చబోతున్నాడు. ఏప్రిల్ 7న శని శతభిషా నక్షత్రాన్ని వదిలి పూర్వాభాద్రపద నక్షత్రంలోకి ప్రవేశించనున్నాడు. పూర్వాభాద్రపద నక్షత్రానికి అధిపతి గురుడు. శనిదేవుడి నక్షత్ర రాశి మార్పు ఈ రాశుల వారికి శుభంగా ఉండనుంది. ఆ అదృష్ట రాశులేంటో ఇక్కడ చూద్దాం..

**వృషభ రాశి:** పూర్వాభాద్రపద నక్షత్రంలోకి వెళ్లనున్న శని దేవుడు వృషభ రాశి వారికి అనేక మంచి ప్రయోజనాలను అందివ్వనుంది. ఉద్యోగాల కోసం వెళ్లే అభ్యర్థులు విజయం సాధిస్తారు. మీ కోరికలన్నీ నెరవేరుతాయి. కుటుంబ సభ్యుల మధ్య అనురాగం పెరుగుతుంది. ఈ సమయంలో విలువైన వస్తువులను కొనుగోలు చేసే అవకాశం ఉంది. మీ సమస్యలన్నీ పరిష్కారమవుతాయి.

**మిథున రాశి:** మిధున రాశి వారికి శని గమనంలో మార్పు అద్భుతంగా ఉంటుంది. మీరు మనసులో ఉన్న కోరికలు నెరవేరుతాయి. నిరుద్యోగులకు పని దొరుకుతుంది. మీరు చదువు, వ్యాపార ప్రయోజనాల కోసం విదేశాలకు వెళతారు. వ్యాపార ప్రయోజనాల కోసం విదేశాలకు వెళతారు. ఏదైనా వ్యాపారంలో అదృష్టం మీకు తోడుగా ఉంటుంది.

# అందుకే వాళ్లు అంత సక్సెస్ అవుతారు..!



మంచి వ్యక్తిగా ఉండాలంటే జీవితంలో సానుకూల అలవాట్లను అలవర్చుకోవడం చాలా ముఖ్యం. ఎక్కడ ఎలా ప్రవర్తించాలి, ఏ టైంలో ఎలా మాట్లాడాలి, పరిస్థితిని బట్టి మన నడవడికను ఎలా మార్చుకోవాలి అనేది స్మార్ట్ పీపుల్స్ పాటించే సూత్రాలు. తెలివైన వ్యక్తులు తమ జీవితంలో ఎదుగుదలకు ఉపయోగపడే కొన్ని ప్రగతిశీల లక్షణాలను కలిగి ఉంటారు. అవేంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం..

జిజ్ఞాస: కొంత మంది వ్యక్తులు తమకున్న పరిజ్ఞానంతో అంతా నాకే తెలుసు అన్నట్లు వ్యవహరిస్తారు. కానీ తెలివైన వ్యక్తులు మాత్రం మాకు తెలిసింది కొంతే.. తెలుసుకోవాల్సింది చాలా ఉంది అన్నట్లు భావిస్తారు. దీనిని జిజ్ఞాస అంటారు. స్మార్ట్ పీపుల్స్ తెలుసుకునే ఆశక్తిని కలిగి ఉండి కొత్త మార్గాలను అన్వేషించడంలో ఉత్సాహంతో ఉంటారు. ఈ క్రమంలో వారి మేధ శక్తి మరింత పెరిగి సక్సెస్ వైపు నడిపిస్తోంది.

చదవడం: ఈ రోజుల్లో చాలా మంది టీవీలు, సోషల్ మీడియా అంటూ కాలం గడిపేస్తున్నారు. 100 కి 50 శాతం మంది ప్రజలు సోషల్ మీడియా కారణంగానే చదవుకు దూరం అవుతున్నారని ఇటీవలె ఓ సర్వేలే తేలింది. అయితే.. తెలివైన వ్యక్తులు ఆసక్తిగల పాఠకులు. వారికి పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం. చదవడం వల్ల కొత్త ఆలోచనలను కనుగొనడం నుండి కొత్త వ్యక్తుల గురించి తెలుసుకోవడం వరకు ఎంతో ఉపయోగపడుతోంది. రీడింగ్ అనేది హొరిజోన్‌ను విస్తృతం చేస్తుంది, అలాగే సమగ్ర జ్ఞానాన్ని పెంచుతోంది.

క్రిటికల్ థింకింగ్: తెలివైన వ్యక్తులు అధిక విమర్శనాత్మక ఆలోచనా (క్రిటికల్ థింకింగ్) నైపుణ్యాలను కలిగి ఉంటారు. అంతే కాకుండా ఇతరులు చెప్పే దాన్ని వారు ఫాలో అవ్వరు.. ఎదుటి వారి అభిప్రాయాన్ని గుడ్డిగా అంగీకరించరు. వేరే వ్యక్తి చెప్పిన విషయంపై ముందు విశ్లేషిస్తారు, ప్రశ్నిస్తారు. తర్వాతే ఒక నిర్ణయానికి వస్తారు. ఇది తెలివైన వ్యక్తుల యొక్క ఆలోచన విధానం.

నిరంతర అభ్యాసం:సాధారణంగా మన ం విన్నదాన్ని చదివినదాన్ని వెంటనే మర్చిపోతాం. అంతే కాదు అక్కడితో వదిలేస్తాం. కానీ తెలివైన వ్యక్తుల ముఖ్య లక్షణాలలో నేర్చుకోవడం ఒకటి. వారు ప్రతి విషయాన్ని ఎంతో ఇంట్రెస్ట్‌గా నేర్చుకుంటారు. దాన్ని నిరంతరం అభ్యసిస్తారు. దాంతో పాటు కంటిన్యూస్‌గా జీవితంలో కొత్త నైపుణ్యాలను నేర్చకుంటూనే ఉంటారు.

**గొప్పలు చెప్పుకోరు:** కొంత మంది వ్యక్తులు నిరంతరం గొప్పలు చెప్పుకుంటూ ఉండేందుకు ఇష్టపడతారు. చిన్న పని చేసిన దాన్ని పెద్దదిగా చాటింపు వేసుకుంటూ.. మేము అది సాధించాము, ఇలా చేశాము అంటూ గొప్పగా ప్రవర్తిస్తారు. అలాంటి ప్రవర్తన ఎదుటి వారికి విసుగ్గా అనిపిస్తుంది. అయితే.. తెలివైన వ్యక్తులు మాత్రం తమ విజయాలు, ప్రతిభ గురించి ఇతరుల ముందు గొప్పగా చెప్పుకోరు. అంతేకాకుండా వారు చాలా వినయపూర్వకంగా ఉంటారు. అదే వారిని ఉన్నతంగా తీర్చుదిద్దుతుంది.

# ఆడపిల్లల విషయంలో తెలిసి ఈ తప్పులు చేయొద్దు!



ప్రస్తుతం అన్ని రంగాల్లో ఆడ పిల్లలు దూసుకుపోతున్నారు. అయినప్పటికీ కొన్ని చోట్ల వివక్ష పోలేదు. కొంత మంది పేరెంట్స్ మగ, ఆడ పిల్లలు కలిగి ఉండే ఇద్దరిని సమానంగా చూడటం, చదివించడం లాంటివి చేస్తుంటారు. కానీ, మరికొంత మంది తల్లిదండ్రులు మాత్రం ఆడ, మగ అనే భేదం చూపించి తప్పులు చేస్తున్నారు. మగ పిల్లలకు ఇచ్చిన ఇంపార్టెన్స్ అమ్మాయిలకు ఇవ్వడం లేదు. దీంతో అమ్మాయిల్లో వెనకబడిపోవడం, అభద్రతా భావాలకు గురికావడం జరుగుతోంది.

డిఫరెన్స్: పేరెంట్స్ గుర్తించుకోవాల్సి అతి ముఖ్యమైన అంశం భేదం. కొడుకులు, కూతుళ్ల మధ్య వ్యత్యాసం చూపిస్తూ వారిని పెండచకూడదు. కానీ చాలా మంది తల్లిదండ్రులు ఇదే తప్పును చేస్తున్నారు. అది మొదటికే మోసం అవుతుంది. ఇలా లింగ భేదం చూపించడం కారణంగా అమ్మాయిలల్లో మానసిక ఆరోగ్యంపై చెడు ప్రభావం పడే అవకాశం చాలా ఉంది. కాబట్టి తల్లిదండ్రులు మగ, ఆడ పిల్లలను సమానంగా పెంచాలి.

**ఆంక్షలు:** ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న ఘోరాల కారణంగా చాలా మంది తల్లిదండ్రులు ఆడపిల్లల విషయంలో చాలా భయాందోళనకు గురవుతున్నారు. దీంతో వారికి ఆంక్షలు విధిస్తున్నారు. స్కూలుకి ఎలా వెళ్లాలి, ఇంటికి ఎలా రావాలి, ఏం చెయ్యాలి, ఎలాంటి బట్టలు ధరించాలి, ఎవరితో మాట్లాడాలి, ఎలా మాట్లాడాలి, అలా చెయ్యకూడదు, ఇలా చెయ్యకూడదు, ఎక్కువగా నవ్వకూడదు ఇలాంటివి ఎన్నో ఆంక్షలు వారికి విధిస్తున్నారు. వీటి ప్రభావం వారి ఎదుగుదలపై, మానసిక ఒత్తిడిపై పడుతోంది. కాబట్టి.. ఆడపిల్లలకు ఆంక్షలు కాకుండా ధైర్యంగా ఎదుర్కోవడం నేర్పించండి. ఎటువంటి పరిస్థితినైనా తమ తెలివితేటలతో తప్పించుకునేలా వారిని తయారు చెయ్యండి. ఇలా చెయ్యడం వల్ల ఎటువంటి కష్ట పరిస్థితి ఎదురైన వాటిని ఎదురించి జీవితంలో ముందుకు వెళ్లగలుగారు.

**స్వేచ్ఛ/ధైర్యం:** ఈ రోజుల్లో చాలా మంది ఆడపిల్లలు వారికి ఏం కావాలన్న స్వేచ్ఛగా అడగలేక పోతున్నారు. వారికి ఏదైనా జరిగిన ధైర్యంగా చెప్పలేక పోతున్నారు. ఆడపిల్లకు వారి స్కూళు ఏజ్ నుంచే తల్లిదండ్రులు వారితో మాట్లాడే ప్రయత్నం చెయ్యండి. అసభ్యకరంగా ఎవరైన ప్రవర్తించారా అనేవి తెలుసుకోండి. సమాజంలో జరిగే చెడు పనుల గురించి వారికి అవగాహన కల్పించండి. దీని వల్ల వారు మీతో అన్ని చెప్పుకోవడానికి అలవాటు పడతారు. అలాగే అలాంటి సమయాల్లో ఎలా ప్రవర్తించాలో చిన్నప్పటి నుంచే ఆడపిల్లలకు ధైర్యాన్ని నింపాలి. లేదంటే పెద్దయ్యాక కూడా గృహహింస, వేధింపుల అనుభవిస్తున్నా సరే భయటకు చెప్పుకునే ధైర్యం లేక చెప్పుకోలేరు. కొన్ని సార్లు ధైర్యం లేకపోవడం ఆడపిల్లల ప్రాణాలు సైతం బలి తీసుకుంటుందని పేరెంట్స్ గుర్తించుకోవాలి.

# నాచురల్‌గా ఇంట్లోనే షాంపూ తయారు..



ఈ మధ్యకాలంలో ప్రతి ఒక్క వ్యక్తి ఎదుర్కొంటున్న సాధారణ సమస్య జుట్టు రాలడం, చిట్లడం. ఈ సమస్య నుంచి బయటపడేందుకు ప్రజలు ఆయిల్, షాంపూ, కండిషనర్ వంటి అనేక రకాల ఖరీదైన ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. అలాగే సెలూన్‌లలో వేల రూపాయలు ఖర్చుచేసి చికిత్సలను తీసుకుంటున్నారు. అయితే ఈ పరిష్కారాలు కొద్ది కాలం మాత్రమే ఉంటాయి. మళ్లీ జుట్టు రాలడం ప్రారంభమవుతుంది. ఎందుకంటే చాలా వరకు బయట తీసుకునే ప్రొడక్ట్స్ రసాయనాలు కలిపి ఉంటాయి. ఇవి జుట్టుకు హాని కలిగిస్తాయి. అయితే పూర్వం రోజుల్లో షాంపూ కి బదులుగా సహజమైన వస్తువులతో తలంటు పోసుకునేవారు. పూర్వకాలంలో లాగా సహజ పదార్థాలతో ఇంట్లోనే షాంపూని సిద్ధం చేసుకోవచ్చు. ఇంట్లో సహజసిద్ధమైన పదార్థాలతో తయారు చేసిన షాంపూ మీ జుట్టును పూర్తిగా శుభ్రం చేయడమే కాకుండా జుట్టును సిల్కీగా మెరిసేలా చేస్తుంది. స్కాల్ప్ హెల్తీగా మారుతుంది. దీని వల్ల జుట్టు పెరుగుదల కూడా మెరుగుపడుతుంది. జుట్టు రాలడం, చుండ్రు వంటి సమస్యలు కూడా తొలగిపోతాయి. అందుకే కెమికల్స్‌కి బై బై చెప్పి షాంపూని ఇంట్లోనే ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం.

రెండు చెంచాల మెంతి గింజలను రాత్రంతా నీటిలో నానబెట్టాలి. 15 నుంచి 20 రీఠాలను ఒక గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టాలి. రోజ్మేరీ లేదా బియ్యం నీరు (బియ్యాన్ని రాత్రంతా నీటిలో నానబెట్టి నీటిని తీసివేయాలి), రెండు మూడు మందార పువ్వులు, ఆకులను తీసుకోవాలి. కలబంద ఆకులను చిన్న ముక్కలుగా చేయాలి. అలాగే రెండు చెంచాల అవిసె గింజలను తీసుకోవాలి.

రీఠా నానబెట్టిన నీటిని తీసివేసి, ఒక బాణలిలో పక్కన పెట్టండి. రీఠాను చిన్న ముక్కలుగా కట్ చేసి వాటిని నీటిలో ఉంచండి. నానబెట్టిన మెంతి గింజలు, బియ్యం నీరు లేదా రోజ్మేరీ, కలబంద, మందార పువ్వులు, ఆకులు, అవిసె గింజలను గిన్నెలో ఉంచండి. ఇప్పుడు ఆ నీటిని పదినిమిషాల పాటు బాగా మరిగించాలి. ఆ తర్వాత దాన్ని ఫిల్టర్ చేయాలి. నీరు కొద్దిగా జెల్ లాగా మారినట్లు అనిపిస్తుంది. ఆ తరువాత నీటిని చల్లారనివ్వండి. కాసేపయ్యాక మిక్సీ గ్రైండర్‌లో వేసి గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత మీ షాంపూ తయారయిపోతుంది.

రీఠా సహజమైన క్లీనర్‌గా పనిచేస్తుంది. తలస్నానం చేసే సమయంలో నురగలు వస్తాయి. అలాగే మెంతులు, అవిసె గింజలు జుట్టు మూలాలను బలోపేతం చేస్తాయి. కండిషనింగ్‌గా కూడా పనిచేసి జుట్టును సిల్కీగా చేస్తుంది. కలబంద, మందార కూడా జుట్టు ఆరోగ్యంగా పెరగడంలో సహాయపడతాయి. ఈ షాంపూ వాడడం ద్వారా జుట్టు నల్లగా, అందంగా, ఒత్తుగా పెరుగుతుంది.

http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



# స్థానిక వార్తలు

## 2003-07 నాటి వృద్ధిరేటు దిశగా భారత జీడీపీ



దేశ ఎకానమీ వృద్ధి రేటుపై మోర్గాన్‌స్టాన్లీ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత ఎకానమీ 2003-2007 కాలంలో ఎలా అయితే వృద్ధి చెందిందో ప్రస్తుత పరిస్థితుల్లోనూ అదేమాదిరి వృద్ధి కనబరుస్తోందని మోర్గాన్ స్టాన్లీ నివేదికలో తెలిపింది. భారత జీడీపీ 2003-07 కాలంలో ఏడాదికి సగటున 8.6 శాతం చొప్పున వృద్ధి కనబరిచింది. ప్రస్తుత పరిస్థితులు కూడా అలానే ఉన్నాయని నివేదిక ద్వారా తెలిసింది. భారీగా పెట్టుబడులు వస్తుండడంతో దేశ జీడీపీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.6 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నారు. కానీ పెట్టుబడులు పెరగడంతో ఎకానమీ వృద్ధి చెందుతోందని ఈ రిపోర్ట్ పేర్కొంది. వినియోగం తగ్గినా, దేశంలోకి వస్తున్న పెట్టుబడులు జీడీపీ గ్రోత్‌ను ముందుండి నడుపుతున్నాయని తెలిపింది. నివేదిక ప్రకారం.. ప్రభుత్వం చేసే మూలధన వ్యయం తగ్గినప్పటికీ ప్రైవేట్ కంపెనీలు చేసే క్యాపెక్స్ పుంజుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం తగ్గినా, పట్టణాల్లో వినియోగం ఊపందుకుంది. గ్లోబల్ ఎగుమతుల్లో ఇండియా వాటా పెరుగుతోంది. ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉంది. జీడీపీ వృద్ధి 2003-2007 సమయంలో 27 శాతం నుంచి 39 శాతానికి చేరుకుంది. ఇదే గరిష్ట వృద్ధిగా నమోదైంది. 2011-21 మధ్య పెట్టుబడులు తగ్గినా ప్రస్తుతం జీడీపీ 34 శాతం దగ్గర ఉందని వివరించింది. భవిష్యత్తులో ఇది 36 శాతానికి చేరుతుందని అంచనా. 2003-2007 లో ద్రవ్యోల్బణం 4.8 శాతంగా ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 5.09 శాతంగా నమోదైనట్లు నివేదిక తెలిపింది.

## మండుతున్న ఎండలు.. ఏసీ కొంటున్నారా..? జాగ్రత్తలివే..

ఎండలు మండిపోతున్నాయి. ఈ ఏడాది భారీగా వేసవి తాపం ఉంటుందని పలువురు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరగనున్నాయి. ఇప్పటికే ఇంట్లో తీవ్ర ఉక్కపోత మొదలైంది. ఫ్యానులు, కూలర్లు ఉన్నా గది అంతా చల్లదనం రాక ఇబ్బందులు పడుతున్నారు. దాంతో చాలా మంది ఏసీలు కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఈ-కామర్స్ యాప్‌లు, రిటైల్ స్టోర?ల్లో వీటి అమ్మకాలు ఇప్పటికే ఊపందుకున్నాయి. అయితే వాటిని కొనుగోలు చేసేపుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

**ఐసెర్ రేటింగ్**

కొందరు సరైన అవగాహన లేక పెద్ద గదులకు తక్కువ సామర్థ్యం ఉన్న ఏసీలు కొనుగోలు చేస్తారు. 110 చదరపు అడుగులు పరిమాణంలో గది ఉంటే 1 టన్ను, 110-150 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన గదికి 1.5 టన్నులు, 150-190 చదరపు అడుగుల గదికి 2 టన్నుల సామర్థ్యమున్న ఏసీని ఎంచుకోవాలి. ఏసీ కొనుగోలు చేసేటప్పుడు ముఖ్యంగా ఐసెర్ (ఐఎస్ఈఈఆర్) రేటింగ్ చూడాలి. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ ప్రమాణాల ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు ఐసెర్ రేటింగ్ మారుతుంది. ప్రస్తుతం ఐసెర్ రేట్ 5 అంత కంటే ఎక్కువ ఉంటే ఫైవ్ స్టార్ ఉంటుంది. రేటింగ్ 4.4- 4.99 మధ్య ఉంటే ఫోర్ రేటింగ్ ఉంటుంది. రేటింగ్‌లో తేడా వల్ల విద్యుత్తు వినియోగంలో మార్పు ఉంటుంది.

**ఇన్వర్టర్‌తో మేలు**



చాలా ఇళ్లల్లో నిత్యం ఏసీని ఉపయోగించే వారు ఇన్వర్టర్‌తో కూడిన ఏసీ కొనుగోలు చేసుకోవాలి. ఇది విద్యుత్తును పొదుపు చేస్తుంది. మోటారు వేగాన్ని నియంత్రిస్తూ గది ఉష్ణోగ్రతను సర్దుబాటు చేస్తుంది. నాన్ ఇన్వర్టర్ ఏసీల్లో ఈ వెసులుబాటు ఉండదు. కేవలం ఆన్, ఆఫ్ మాత్రమే ఉంటాయి. కేవలం వేసవిలో మాత్రమే రోజుకు మూడు నుంచి నాలుగు గంటలు ఉపయోగించేవారు నాన్ ఇన్వర్టర్ ఏసీ కొనుక్కోవచ్చు. మార్కెట్‌లో చాలా వరకు కన్వర్టబుల్ ఏసీలు అందుబాటులో ఉన్నాయి. చిన్న గదిలో 1.5 టన్నుల సామర్థ్యం కలిగిన వాటిని ఏర్పాటు చేసినా.. అవసరం మేరకు 1 టన్ను, 0.8 టన్ను ఇలా సమర్థ్యాన్ని మార్చుకోవచ్చు. సామర్థ్యం తగ్గించడం వల్ల అవుట్‌డోర్ యూనిట్‌లోని ఫ్యాన్ వేగం తగ్గి విద్యుత్తు పొదుపు అవుతుంది.

**ధరల మధ్య వ్యత్యాసం**

ఏసీ కొనుగోలు చేసేప్పుడే తప్పకుండా స్టెబిలైజర్ కొనాలి. వోల్టేజ్ హెచ్చుతగ్గుల పరిధి దాటినప్పుడు స్టెబిలైజర్ లేకుంటే ఏసీ పాడవుతుంది. వోల్టేజ్ హెచ్చుతగ్గుల వల్ల పాడైతే వారంటీ ఉండదనే విషయం గుర్తుపెట్టుకోవాలి. చాలా కంపెనీలు స్మార్ట్ ఏసీలను మార్కెట్లోకి తీసుకొచ్చాయి. వాటిని యాప్‌ల ద్వారానూ నిర్వహించవచ్చు. ఏసీ కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా వారంటీ చూసుకోవాలి. ఈ-కామర్స్ సంస్థల మధ్య ధరల విషయంలో తేడాలు ఉంటాయి. ఆఫర్లు ఉంటే గమనించాలి. కొన్ని సందర్భాల్లో ఈ-కామర్స్ సంస్థల కంటే కంపెనీల డీలర్ల వద్ద కూడా తక్కువ ధరకు లభిస్తాయి.

## మారుతి ఫ్రాంక్స్ బేస్డ్ టయోటా టైసోర్.. ఏప్రిల్ 3న లాంచింగ్

టయోటా-మారుతి గ్లోబల్ భాగస్వామ్యం నుంచి మరో కారు భారత్ మార్కెట్లో ఆవిష్కరించనున్నారు. మారుతి సుజుకి ఫ్రాంక్స్ బేస్డ్ టయోటా అర్బన్ క్రూయిజర్ టైసోర్ మోడల్ కారును వచ్చేనెల మూడో తేదీన టయోటా కిర్లోస్కర్ మోటార్ ఆవిష్కరిస్తుంది. ప్రస్తుతం మారుతి విక్రయిస్తున్న బాలెనో -టయోటా గ్లాన్జా, మారుతి ఎర్టిగా- రూమియాన్, మారుతి సుజుకి ప్రీ ఫేస్ లిఫ్ట్ విటారా బ్రెజా వర్సెస్ టయోటా అర్బన్ క్రూయిజర్, మారుతితో టయోటా ఇన్నోవా హైక్రాస్, మారుతి సుజుకి జిమ్నీని ఇన్ విక్టోగా మార్చినట్లు తెలుస్తున్నది. రెండు కంపెనీలు కలిసి మిడ్ సైజ్ ఎస్‌యూవీ కార్లు డెవలప్ చేస్తుంటాయి. మారుతి సుజుకి గ్రాండ్ విటారాను డెవలప్ చేస్తే, అర్బన్ క్రూయిజర్ ను టయోటా డిజైన్ చేశాయి. టయోటా టైసోర్ కారు ఎక్స్‌టీరియర్‌గా న్యూ గ్రిల్లె, రీ డిజైన్డ్ హెడ్ ల్యాంప్, టెయిల్ ల్యాంప్ యూనిట్స్, ట్వీక్డ్ బంపర్లు, ఇంటీరియర్‌గా ఫ్రెష్ అప్ హెూల్‌స్టరీ ఉంటాయి. మారుతి సుజుకి ఫ్రాంక్స్ 40 వేల కి.మీ లేదా రెండేండ్ల వారంటీ, టయోటా లక్ష కి.మీ లేదా మూడేండ్ల వారంటీ కలిగి ఉంటాయి. మారుతి సుజుకి ఫ్రాంక్స్ 1.2 -లీటర్ల డ్యుయల్ జెట్ డ్యుయల్ వీవీటీ పెట్రోల్ (89.73 పీఎస్ విద్యుత్, 113 ఎన్ఎం టార్క్), 1.0 లీటర్ టర్బో బూస్టర్ జెట్ పెట్రోల్ (100.06 పీఎస్ విద్యుత్, 147.6 ఎన్ఎం టార్క్) ఇంజిన్ కలిగి ఉంటాయి. 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్ 5-స్పీడ్ ఎంటీ లేదా 5-స్పీడ్ ఎఎంటీ, 1.0-లీటర్ ఇంజిన్ 5-స్పీడ్ ఎంటీ, 6-స్పీడ్ ఏటీ ఆప్షన్లలో లభిస్తుంది. సీఎన్జీ ఆప్షన్ మారుతి ఫ్రాంక్స్ 1.2 లీటర్ల డ్యుయల్ జెట్ డ్యుయల్ వీవీటీ పెట్రోల్




ఇంజిన్ (77.5 విద్యుత్, 98.5 ఎన్ఎం టార్క్) విత్ 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ వస్తుంది. ట్రిమ్స్, పవర్ ట్రైన్ల ఆధారంగా టయోటా అర్బన్ క్రూయిజర్ టైసోర్ ధరలు ఉంటాయి.


## మనవడికి రూ.240కోట్ల విలువైన షేర్లు గిఫ్ట్ ఇచ్చిన ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి..

ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి నాలుగు నెలల తన మనవడు ఏకాగ్రహ్ రోహన్ మూర్తికి రూ.240 కోట్ల విలువైన షేర్లను బహుమతిగా ఇచ్చారు. దాంతో రోహన్ మూర్తి యంగ్ మిలియనీర్‌గా నిలిచారు. రోహన్ మూర్తికి 15లక్షల ఇన్ఫోసిస్ షేర్లు నారాయణ మూర్తి గిఫ్ట్‌గా ఇచ్చారు. కంపెనీలో మొత్తం విలువలో షేర్లు 0.04శాతం. ప్రస్తుతం నారాయణ మూర్తి వాటా ఇన్ఫోసిస్‌లో 0.40శాతం నుంచి 0.36శాతానికి తగ్గింది. ప్రస్తుతం ఆయనకు కంపెనీలో దాదాపు 1.51కోట్ల షేర్లున్నాయి. ఆఫ్ మార్కెట్ ట్రేడ్‌లో లావాదేవీలు జరిగినట్లు ఫైలింగ్‌లో పేర్కొన్నారు. ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి - సుధామూర్తి తనయుడు రోహన్ మూర్తి ఉండగా.. అపర్ణ కృష్ణన్‌తో పెళ్లి జరగ్గా.. ఈ జంటకు గతేడాది నవంబర్‌లో కొడుకు పుట్టాడు. దాంతో నారాయణమూర్తి తాత అయ్యారు. ఆ బాబుకి ఏకాగ్రహ్ రోహన్ మూర్తిగా నామకరణం చేశారు. నారాయణ మూర్తి-సుధా మూర్తి దంపతులకు కూతురు సైతం ఉన్నారు. ఆమె అక్షతా మూర్తి. ఆమె బ్రిటిష్ ప్రధాని రిషి సునాక్ భార్య. ఇదిలా ఉండగా.. నారాయణమూర్తి ఇన్ఫోసిస్‌ను 1981 సంవత్సరంలో స్థాపించారు. కంపెనీ మార్చి 1999లో నాస్‌డాక్‌లో లిస్ట్ అయ్యింది. ఇక సుధామూర్తి ఇటీవల రాజ్యసభ సభ్యురాలిగా ఎంపికయ్యారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెను ప్రధాని నరేంద్ర మోదీ ఎంపీగా నామినేట్ చేసిన విషయం తెలిసిందే.

## ఆర్సీబీకి తొలి టైటిల్.. ఫ్రాంచైజీ ఫస్ట్ ఓనర్ రియాక్షన్ ఇదే..

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఎట్టకేలకు ట్రోఫీ (డబ్ల్యూపీఎల్) నెగ్గడంతో ఆ జట్టు అభిమానులు సంబురాల్లో మునిగితేలుతున్నారు. స్మృతి మంధాన సారథ్యంలోని ఆర్సీబీ.. ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ రెండో సీజన్‌లోనే కప్పుకొట్టింది. ఈ నేపథ్యంలో ఆర్సీబీ మాజీ యజమాని, ఈ ఫ్రాంచైజీ వ్యవస్థాపకుడు విజయ్ మాల్యా స్పందించాడు. మహిళల జట్టుకు శుభాకాంక్షలు తెలిపిన మాల్యా.. మెన్స్ టీమ్ కూడా కప్ గెలిస్తే ఈసారి ఆనందం డబుల్ అవుతుందని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. మాల్యా ట్విటర్ (ఎక్స్) వేదికగా స్పందిస్తూ 'డబ్ల్యూపీఎల్ ట్రోఫీ నెగ్గిన ఆర్సీబీ మహిళల జట్టుకు హృదయపూర్వక అభినందనలు. ఇదే స్ఫూర్తితో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పురుషుల ట్రోఫీ (ఐపీఎల్)ను నెగ్గితే ఈ ఆనందం డబుల్ అవుతుంది. గుడ్ లక్..' అని పోస్ట్ చేశాడు. మాల్యా పెట్టిన ఈ పోస్ట్‌పై నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ చేస్తున్నారు. 'ఇప్పుడు మనం ఒక డీల్ చేద్దాం. ఒకవేళ ఐపీఎల్ -2024లో గనక ఆర్సీబీ గెలిస్తే నేను ఇండియాకు తిరిగివస్తా అని చెప్పేయండి. చూద్దాం అలా అయినా మీ పురుషుల జట్టు కప్పు కొడుతుం దేమో..', 'పురుషుల జట్టా..? అంత సీన్ లేదు. అది అవ్వదులే గానీ మీ ఆనందం డబుల్ అవ్వాలంటే మళ్లీ






అమ్మాయిలే నెక్స్ట్ సీజన్‌లో గెలవాలి..' అని పోస్టులు చేస్తుండగా కొందరు.. 'ఎస్‌బీఐ మీకోసం వెయిటింగ్ ఇక్కడ.. ఎప్పుడొస్తున్నారు..?' అంటూ కామెంట్స్ చేస్తున్నారు. బ్యాంకులకు సుమారు రూ. 9వేల కోట్ల ఎగనామం పెట్టిన విజయ్ మాల్యా.. చాలాకాలంగా యూకేలో ఉంటున్న విషయం విదితమే.

## ఐపీఎల్ మోస్ట్ ఎక్స్‌పెన్సివ్ ప్లేయర్ వచ్చేశాడు.. కేకేఆర్‌లో ఫుల్ జోష్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్‌కు సర్వం సిద్ధమైంది. మరో నాలుగు రోజుల్లో చెన్నై - బెంగళూరు మధ్య తొలిమ్యాచ్‌తో ఈ సీజన్‌కు నాంది పడనుంది. కాగా ఐపీఎల్ చరిత్రలోనే వేలంలో అత్యంత ధర పలికిన ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ భారత్‌కు వచ్చేశాడు. కొద్దిరోజుల క్రితమే దుబాయ్ వేదికగా ముగిసిన వేలం ప్రక్రియలో కోల్‌కతా నైట్ రైడర్స్.. రూ. 24.50 కోట్లు వెచ్చించి స్టార్క్‌ను కొనుగోలు చేసింది. ఆదివారం రాత్రి స్టార్క్ కోల్‌కతాకు చేరుకున్నాడు. ఈ మేరకు కేకేఆర్ తమ ట్విటర్ (ఎక్స్) ఖాతాలో స్టార్క్ కోల్‌కతాకు విచ్చేసిన వీడియోను పోస్ట్ చేసింది. సుదీర్ఘకాలం తర్వాత ఐపీఎల్ ఆడనున్న స్టార్క్‌పై ఈ సీజన్‌లో కోల్‌కతా భారీ ఆశలే పెట్టుకుంది. 2014 తర్వాత ట్రోఫీ నెగ్గని ఆ జట్టు.. ఈసారి ఎలాగైనా దానిని సొంతం చేసుకోవాలని భావిస్తోంది. 2012, 2014లలో కేకేఆర్‌కు ట్రోఫీలు అందించిన కెప్టెన్ గౌతం గంభీర్.. ఈసారి టీమ్‌కు మెంటార్‌గా ఉండనున్నాడు. గత సీజన్‌కు దూరమైన శ్రేయస్.. ఈ సీజన్‌లో మాత్రం అందుబాటులో ఉండనున్నాడు. ఐపీఎల్ 17వ సీజన్‌లో కేకేఆర్.. తమ తొలి మ్యాచ్‌ను ఈనెల 23న ఈడెన్ గార్డెన్ వేదికగా సన్ రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఐపీఎల్ ఆరంభానికి ముందే కేకేఆర్.. ప్రాక్టీస్ మ్యాచ్‌లతో సీజన్ కోసం సన్నద్ధమవుతున్నది.





# స్పోర్ట్స్

## హసరంగను ఉతికి ఆరేసిన అనామకుడు.. బంగ్లాదేశ్ సంచలనం



శ్రీలంకతో జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో బంగ్లాదేశ్ సంచలన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్.. శ్రీలంకను 4 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 50 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌట్ కాగా.. బంగ్లాదేశ్ 40.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి మ్యాచ్‌తో పాటు సిరీస్‌ను చేతిక్కించుకుంది.

**సెంచరీతో ఆదుకున్న లియనగే..**

మిడిలార్డర్ బ్యాటర్ జనిత్ లియనగే అజేయ శతకంతో (102 బంతుల్లో 101 నాటౌట్‌బీ 11 ఫోర్లు, 2 సిక్సర్లు) కదంతొక్కడంతో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక ఓ మోస్తరు స్కోర్ చేయగలిగింది. లంక ఇన్నింగ్స్‌లో లియనగే మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయారు. అసలంక 37, కుశాల్ మెండిస్ 29, సమరవిక్రమ 14, తీక్షణ 15, హసరంగ 11 పరుగులు చేశారు. బంగ్లా బౌలర్లలో తస్కిన్ అహ్మద్ 3 వికెట్లు పడగొట్టగా.. ముస్తాఫిజుర్, మెహిది హసన్ మీరజ్ తలో 2, సౌమ్య సర్కార్, రిషద్ హెూసేన్ చెరో వికెట్ పడగొట్టారు. 236 పరుగుల నామమాత్రపు లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన బంగ్లాదేశ్.. తంజిద్ హసన్ (84) రిషద్ హెూసేన్ (48 నాటౌట్), ముష్ఫికర్ రహీం (37 నాటౌట్) రాణించడంతో మరో 58 బంతులు మిగిలుండగానే 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

**హసరంగను ఉతికి ఆరేసిన రిషద్ హెూసేన్..**

ఈ మ్యాచ్‌లో లంక స్పిన్ మాంత్రికుడు వనిందు హసరంగను బంగ్లాదేశ్ టెయిలెండర్ రిషద్ హెూసేన్ ఉతికి ఆరేశాడు. హసరంగ బౌలింగ్‌లో 11 బంతులను ఎదుర్కొన్న రిషద్ 4 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 40 పరుగులు చేశాడు. రిషద్ రెచ్చిపోవడంతో బంగ్లాదేశ్ ఊహించిన దానికంటే త్వరగా మ్యాచ్‌ను ముగించింది



# సీక్వెల్‌తో రెడీ అంటోన్న నాగచైతన్య


కథాబలమున్న సినిమాలతో సినిమాలు చేసే హీరోల్లో టాప్‌లో ఉంటాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య హిట్, ఫెయిల్యూర్ టాక్‌తో సంబంధం లేకుండా కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తుంటాడు. విక్రమ్ కే కుమార్ దర్శకత్వంలో చైతూ నటించిన వెబ్ ప్రాజెక్టు ధూత తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో అమెజాన్ ప్రైమ్‌లో గతేడాది డిసెంబర్ 1న విడుదలైంది. సాలిడ్ వ్యూయర్ షిప్‌తో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తాజా అప్‌డేట్ ప్రకారం ధూత సీక్వెల్ రెడీ అవుతోంది. సీక్వెల్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను మార్చి 19న వెల్లడించనున్నారని ఫిలింనగర్ సర్కిల్ టాక్. అమెజాన్ ప్రైమ్ వీడియో 2024లో కంటెంట్ ఎలా ఉండబోతుందో మార్చి 19న తెలియజేయనుందట. ఇదే రోజు ధూత 2తోపాటు అమెజాన్ ప్రైమ్ నుంచి పలు అప్‌డేట్స్ కూడా ఉండబోతున్నాయని వార్తలు వస్తుండగా.. మరికొన్ని గంటల్లో దీనిపై క్లారిటీ రానుంది. ఫస్ట్ పార్టులో ప్రియా భవానీ శంకర్, పార్వతీ తిరువోతు, ప్రాచీ దేశాయ్, పశుపతి, రవీంద్ర విజయ్ ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నార్త్ స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై శరత్ మరార్ సీక్వెల్‌ను తెరకెక్కించనున్నారు. మరి సీక్వెల్‌లో ఎవరెవరు కనిపించబోతున్నారనేది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది. నాగచైతన్య ప్రస్తుతం చందూమొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న NC23 సినిమాతో బిజీగా ఉన్నాడు. ఈ చిత్రానికి తండేల్ టైటిల్‌ను ఫిక్స్ చేయగా.. ఇప్పటికే విడుదల చేసిన తండేల్ ఫస్ట్ లుక్‌లో చైతూ ఫిషర్‌మెన్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులను ఖుషీ చేస్తున్నాడు. ఫిషర్‌మెన్ స్టోరీ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న %చీజ%23ని పాపులర్ బ్యానర్ గీతాఆర్ట్స్‌పై తెరకెక్కిస్తోంది.

# నేను కలిసి పనిచేసిన గొప్ప వ్యక్తుల్లో రెహమాన్ ఒకరు



సలార్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్న తాజా చిత్రం "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం). ఈ సినిమాకు అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ దర్శకత్వం వహిస్తుండగా.. అమలాపాల్, కేఆర్ గోకుల్, జిమ్మీ జీన్ లూయిస్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇక ఈ సినిమాకు అకాడమీ అవార్డు విజేత ఏఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా మార్చి 28న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో కొచ్చిలో ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం నిర్వహించారు మేకర్స్. ఇక ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మలయాళ స్టార్ మోహన్ లాల్ వచ్చాడు. అయితే ఈ వేడుకలో మోహన్ లాల్ మాట్లాడుతూ.. ఏఆర్.రెహమాన్‌పై ప్రశంసలు కురిపించాడు. రెహమాన్ గురించి నేను ప్రత్యేకంగా పరిచయం చేయడం అక్కర్లేదు. నేను ఒక నటుడిగా గుర్తింపు సాధించిన 'ఇరువర్' చిత్రానికి రెహమాన్ సంగీతం అందించారు. ఇందులోని పాటలు ఇప్పటికీ వినిపిస్తుంటాయి. యోధ సినిమా వచ్చి 30 ఏండ్లు అవుతున్నా అందులోని పాటలు వింటుంటే ఇప్పటికి రెహమాన్ గుర్తుకువస్తాడు. ఇక ఈ సినిమా కాకుండా మేమిద్దరం కలిసి 'ఆరాట్టు' సినిమాలో కలిసి నటించాము. ఈ అవకాశం వచ్చినందుకు చాలా ఆనందపడ్డాను. రెహమాన్ మలయాళ సినిమాకు సంగీతం అందించినందుకు కృతజ్ఞతలు. నేను కలిసి పనిచేసిన గొప్ప వ్యక్తుల్లో రెహమాన్ ఒకరు. అతని తండ్రి కే.శేఖర్ కూడా మలయాళంలో 23 సినిమాలకు పైగా కంపోజర్‌గా పనిచేశారు. దాదాపు 500 పైగా సినిమాలకు సంగీతం అందించాడు అంటూ మోహన్ లాల్ వెల్లడించాడు.

ఇక "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా కథ విషయానికి వస్తే.. 1990లో జీవనోపాధి కోసం కేరళను వదిలి విదేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే యువకుడు అక్కడ ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నాడు అనేది సినిమా స్టోరీ. ఇక ఈ సినిమా పూర్తిగా ఎడారిలో తెరకెక్కిన తొలి భారతీయ సినిమాగా రికార్డు సాధించింది. ప్రముఖ రచయిత బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా ఈ సినిమా వస్తుండగా.. మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# మరో కొత్త మల్టీప్లెక్స్ ప్లాన్

టాలీవుడ్ స్టార్ హీరోలు మల్టీప్లెక్స్ థియేటర్ బిజినెస్‌లోకి ఎంటర్ అవుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే అగ్ర హీరోలు మహేష్‌బాబు, విజయ్ దేవరకొండ, అల్లు అర్జున్‌లు మల్టీప్లెక్స్ థియేటర్ బిజినెస్‌లోకి ఎంటర్ అవ్వగా తాజాగా రవితేజ కూడా మల్టీప్లెక్స్ బిజినెస్‌లోకి అడుగుపెట్టబోతున్నారు. ఈ మాస్ హీరో ఏషియన్ సంస్థతో కలిసి ART సినిమాస్ అనే మల్టీప్లెక్స్ కట్టబోతున్నట్టు సమాచారం. ఇదిలావుంటే అల్లుఅర్జున్ కొత్తగా మరో మల్టీప్లెక్స్ ప్లాన్ చేస్తున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌లో సినిమాస్ పేరిట మల్టీప్లెక్స్ బన్నీ తాజాగా మరో మల్టీప్లెక్స్ ప్లాన్ చేస్తున్నాడు. అయితే ఇప్పుడు తెలంగాణలో కాదు ఏపీలో. అవును వైజాగ్‌లో అల్లు అర్జున్ AAA మల్టీప్లెక్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వైజాగ్‌లో కొత్తగా కడుతున్న ఇనార్బిట్ మాల్‌లో ఆసియన్ సంస్థతో కలిసి హైదరాబాద్‌లో ఉన్నట్లే మల్టీప్లెక్స్ కట్టిస్తున్నారట. కాగా దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ మల్టీప్లెక్స్ థియేటర్ బిజినెస్‌లోకి ఇంతకుముందు మహేష్‌బాబు, విజయ్ దేవరకొండ, అల్లు అర్జున్‌లు ఎంట్రీ ఇచ్చారు. సూపర్ స్టార్ మహేష్ బాబు ఏషియన్ సంస్థతో కలిసి మల్టీప్లెక్స్ కట్టి బాగా సక్సెస్ అయ్యారు. ఇక మహేష్ తర్వాత రౌడి హీరో విజయ్ దేవరకొండ మహబూబ్ నగర్‌లో సినిమాస్ అనే పేరుతో మల్టీప్లెక్స్ స్థాపించి సక్సెస్ అయ్యాడు. వీరిద్దరి తరువాత అల్లు అర్జున్ కూడా సినిమాస్ అని హైదరాబాద్ అమీర్‌పేట్‌లో మల్టీప్లెక్స్ ప్రారంభించాడు. ఇక మాస్ హీరో రవితేజ ఏషియన్ సంస్థతో కలిసి సినిమాస్ నిర్మిస్తుండగా.. ఇది హైదరాబాద్ దిల్‌సుఖ్ నగర్‌లోని వెంకటాద్రి థియేటర్‌ను కూల్చి మల్టీప్లెక్స్‌గా కడుతున్నట్లు టాక్ నడుస్తుంది. ఇందులో మొత్తం ఐదు స్క్రీన్లు ఉండనున్నట్లు టాక్.



# నేను బానే ఉన్న ఆ రూమర్స్ నమ్మొద్దు..

ప్రముఖ టాలీవుడ్ ప్లేబ్యాక్ సింగర్ మంగ్లీ రోడ్డు ప్రమాదానికి గురైయినట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం ఆమె ప్రయాణిస్తున్న కారు ఓ డీసీఎం వ్యాన్ ఢీకొట్టిందని. ఈ ఘటనలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయని ప్రచారం జరిగింది. హైదరాబాద్ – బెంగళూరు జాతీయ రహదారిపై తొం డుపల్లి వంతెన వద్ద శనివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగినట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా ఈ వార్తలపై మంగ్లీ స్పందించింది. నేను క్షేమంగా ఉన్నానని మంగ్లీ పేర్కొంది. ఈ ఘటన రెండు రోజుల క్రింద జరిగింది. అనుకోకుండా జరిగిన చిన్న ప్రమాదం. దయచేసి ఈ సంఘటన గురించి వస్తున్న పుకార్లను ఎవరూ నమ్మొద్దు. నాపై చూపిస్తున్న ప్రేమకు ధన్యవాదాలు. అంటూ మంగ్లీ తెలిపింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతి వనంలో నిర్వహించిన ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవానికి మంగ్లీ శనివారం హాజరయ్యారు. కార్యక్రమం పూర్తి చేసుకొని అర్ధరాత్రి సమయంలో మేఘ్‌రాజ్, మనోహర్‌తో కలిసి ఆమె కారులో ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై తొండుపల్లి వంతెన వద్దకు రాగానే కర్ణాటకకు చెందిన ఓ డీసీఎం వాహనం వెనుక నుంచి వేగంగా మంగ్లీ ప్రయాణిస్తున్న కారును ఢీ కొట్టింది.



# కల్కి 2898 ఏడీ వాయిదా పుకార్లు..

గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్టు కల్కి 2898 ఏడీ సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో వస్తున్న ఈ చిత్రానికి మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మే 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్టు ప్రకటించారని తెలిసిందే. అయితే విడుదల వాయిదా పడనుందంటూ పుకార్లు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. మరోవైపు ఇవేమి పట్టించుకోకుండా ప్రభాస్ అండ్ టీం హైదరాబాద్‌లో షూట్ షెడ్యూల్‌ను కొనసాగిస్తుందట. తాజాగా సినిమాటోగ్రాఫర్ అందించిన అప్‌డేట్ ప్రకారం సిటీలో ఈ మూవీ నైట్ షూట్స్ కొనసాగుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా అనుకున్న సమయానికే వస్తుందా..? లేదంటే పుకార్లే నిజం కానున్నాయా..? అనే దానిపై రాబోయే రోజుల్లో మేకర్స్ నుంచి ఏదైనా క్లారిటీ వస్తుందేమో చూడాలి మరి. ఈ సినిమాలోని పాట కోసం ప్రభాస్ టీం రీసెంట్‌గా ఇటలీలో ల్యాండైన విషయం తెలిసిందే. సర్దినియా ఐలాండ్‌లో ప్రభాస్, దిశాపటానీపై వచ్చే పాటను చిత్రీకరించగా.. లొకేషన్‌లో ప్రభాస్, దిశాపటానీ స్టైలిష్ లుక్‌లో ఉన్న స్టిల్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఈ పాటలో ప్రభాస్ మళ్లీ సూపర్ స్టైలిష్‌గా కనిపించబోతున్నట్టు స్టిల్స్ చెప్పకనే చెబుతున్నాయి.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com